రంగస్థలంపై సరికొత్త ప్రయోగం

# గాంధీ జయంతి

(నాటకం)



ఓ. విజయభాస్కర్

# గాంధీ జయంతి
## (నాటకం)

- ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మలయాళం, గుజరాతీ, ఒరియా, తమిళ భాషల్లోకి అనువదించబడింది.
- అక్టోబర్ 2002వ సంవత్సరంలో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు వెండి నందితోపాటు ఉత్తమ నటుడు, ఉత్తమ క్యారెక్టర్ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు విభాగాల్లో నంది బహుమతులు పొందినది.

# ఇందలి పాత్రలు

1. గాంధీ
2. రాజారాం
3. యమధర్మరాజు
4. చిత్రగుప్తుడు
5. యమభటులు... ఇద్దరు
6. జడ్జి
7. పబ్లిక్ ప్రాసిక్యూటర్
8. ఇంజనీర్
9. పోలీస్ కమీషనర్
10. కాంట్రాక్టర్
11. అధికార పార్టీ నాయకుడు
12. ప్రతిపక్ష పార్టీ నాయకురాలు
13. రామరాజ్య పార్టీ నాయకుడు
14. పేదల పార్టీ నాయకుడు
15. ఎమ్మెల్యే యాదగిరి
16. ఎమ్మెల్యే 1
17. ఎమ్మెల్యే 2
18. ఎమ్మెల్యే 3
19. ఎమ్మెల్యే 4

20. అటెండర్

21. యాదగిరి పి.ఎ

22. పోలింగ్ ఆఫీసర్

23. సభాధ్యక్షుడు

24. పోలింగ్ ఏజంట్ 1

25. పోలింగ్ ఏజంట్ 2

26. కార్యకర్త

27. తాటికల్లు సాంబయ్య

ఇంకా, మంత్రి గన్‌మెన్ ఇద్దరు, రైల్వేపోర్టరు, ప్రయాణీకులు, డాక్టరు, జైలర్, మెజిస్ట్రేట్, టి.వి. న్యూస్ రీడర్, ఫోటోగ్రాఫరులు వగైరా వస్తారు.

**ప్రథమ ప్రదర్శన : 'రమణీయరంగం' (హైద్రాబాద్) వారిచే**
**21 అక్టోబర్ 2001న రవీంద్రభారతి, హైదరాబాదులో**

## ఆనాటి నటీనటవర్గం

| | | |
|---|---|---|
| 1. | గాంధీ | : శ్రీ జె.వి. రమణమూర్తి |
| 2. | రాజారాం | : శ్రీ కాకరాల |
| 3. | యమధర్మరాజు | : శ్రీ క్రమధాటి వెంకటేశ్వర శర్మ |
| 4. | చిత్రగుప్తుడు & పబ్లిక్ ప్రాసిక్యూటర్ | : శ్రీ గోవిందరాజుల నాగేశ్వరరావు |
| 5. | డివిజనల్ ఇంజనీర్ & ఎమ్మెల్యే 1 | : శ్రీ బెందూరి నగరాజారావు |
| 6. | అసిస్టెంట్ ఇంజనీర్ & పోలీస్ కమీషనర్ | : శ్రీ కె.వి. రమణారెడ్డి |
| 7. | కాంట్రాక్టర్ | : శ్రీ ముక్తేవి ప్రకాశరావు |
| 8. | అధికార పార్టీ నాయకుడు | : శ్రీ చిట్టా ప్రకాశరావు |
| 9. | ప్రతిపక్ష పార్టీ నాయకురాలు | : శ్రీమతి నిర్మల |
| 10. | రామరాజ్య పార్టీ నాయకుడు | : శ్రీ ముట్నూరి కామేశ్వరరావు |
| 11. | పేదల పార్టీ నాయకుడు | : డా॥ బి.ఎస్. ప్రసాద్ |
| 12. | ఎమ్మెల్యే యాదగిరి | : శ్రీ రఘుబాబు |
| 13. | ఎమ్మెల్యే 2 & యాదగిరి పి.ఏ. | : శ్రీ శ్రీధర్ |
| 14. | ఎమ్మెల్యే 3 & పోలింగ్ ఏజెంట్ | : శ్రీ రాజు |
| 15. | అటెండర్ | : శ్రీ బాల గంగాధర్ |
| 16. | పోలింగ్ ఆఫీసర్ | : శ్రీ రాజేష్ మెహ్రా |
| 17. | జడ్జి | : శ్రీ కె. కేశవరావు |
| 18. | సభాధ్యక్షుడు | : శ్రీ నరేష్ |

**నృత్యం :** మాస్టర్ తేజస్వి, మాస్టర్ అర్జున్, మాస్టర్ రాజగోపాల్, మాస్టర్ అనురాగ్, మాస్టర్ నితిన్, కుమారి దీప్తి, కుమారి ప్రియంవద, కుమారి వసుంధర, కుమారి సాగరిక, కుమారి నేహ.

***దర్శకత్వం : జె.వి. రమణమూర్తి***

| | | |
|---|---|---|
| ***సంగీతం*** | : | **శ్రీ శరశ్చంద్ర** |
| ***సహాయకులు*** | : | **శ్రీ శివరామకృష్ణ, చి॥ క్రాంతి కుమార్** |
| ***రంగోద్దీపనం*** | : | **శ్రీ ముక్తేవి ప్రకాశరావు** |
| ***ఆహార్యం*** | : | **శ్రీమతి శోభాలత** |
| ***రంగస్థల నిర్వహణ*** | : | **శ్రీ సురభి బాబ్జి** |
| ***నృత్య దర్శకత్వం*** | : | **శ్రీమతి ఎం.వి. కమలా రమణి (కీర్తన)** |

**ఈ నాటకం 2002 జూన్ 1వ తేదీన**
**'రమణీయరంగం' (హైదరాబాదు) వారిచే**
**నంది నాటకోత్సవాలలో ప్రదర్శింపబడింది.**

ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు **వెండినందితో** సహా **ఐదు** నందులు గెలుచుకుంది.

## ఆనాటి నటీనటవర్గం

| | | | |
|---|---|---|---|
| 1. | గాంధీ | : | **శ్రీ జె.వి. రమణమూర్తి** (ఉత్తమ నటుడు) |
| 2. | రాజారాం | : | **శ్రీ కాకరాల** (ఉత్తమ క్యారెక్టర్ నటుడు) |
| 3. | యమధర్మరాజు | : | శ్రీ రాజ్‌కుమార్ |
| 4. | చిత్రగుప్తుడు, పి.పి. & పోలింగ్ ఏజెంట్ | : | శ్రీ గోవిందరాజుల నాగేశ్వరరావు |
| 5. | ఇంజనీర్ | : | శ్రీ ముక్తేవి ప్రకాశరావు |
| 6. | కాంట్రాక్టర్ & బెంచిగుమస్తా | : | శ్రీ మల్లంపల్లి శ్రీరామచంద్రమూర్తి |
| 7. | అధికార పార్టీ నాయకుడు | : | శ్రీ రఘునాధరెడ్డి |
| 8. | ప్రతిపక్ష పార్టీ నాయకురాలు | : | **శ్రీమతి నిర్మలారెడ్డి** (ఉత్తమ నటి) |
| 9. | రామరాజ్య పార్టీ నాయకుడు | : | శ్రీ ముట్నూరి కామేశ్వరరావు |
| 10. | పేదల పార్టీ నాయకుడు | : | డా॥ బత్తుల శివ ప్రసాద్ |
| 11. | ఎమ్మెల్యే యాదగిరి | : | **శ్రీ రఘుబాబు** (ఉత్తమ హాస్యనటుడు) |
| 12. | యాదగిరి పి.ఏ. | : | శ్రీ పి. వెంకటేశ్వరరావు |
| 13. | ఎమ్మెల్యే - 3 & పోలింగ్ ఏజెంట్ | : | శ్రీ బి. హెచ్.పి. రాజు |
| 14. | అటెండర్, పోలింగ్ ఆఫీసర్-2, కోర్టు జవాను | : | శ్రీ శ్రీకాకుళపు బాలగంగాధర్ |
| 15. | పోలింగ్ ఆఫీసర్ - 1 | : | శ్రీ కృష్ణ |
| 16. | జడ్జి | : | శ్రీ కె. కేశవరావు |
| 17. | సభాధ్యక్షుడు | : | శ్రీ కె. కేశవరావు |
| 18. | సభాధ్యక్షుడు & ఎమ్మెల్యే - 1 | : | శ్రీ రవీంద్రరెడ్డి |
| 19. | పోలీస్ కమీషనర్ & యమభటుడు | : | శ్రీ కె.బి.ఆర్. కృష్ణంరాజు |
| 20. | యమభటుడు, గన్‌మాన్, పోర్టర్ | : | శ్రీ యాదగిరి |
| 21. | ఓటరు, ఫోటోగ్రాఫరు, ఎమ్మెల్యే | : | శ్రీ ఆంజనేయరాజు |
| 22. | టి.వి. న్యూస్ రీడర్ | : | కుమారి మేఘన |

***దర్శకత్వం :* జె.వి. రమణమూర్తి**

| | | | |
|---|---|---|---|
| ***సంగీతం*** | **: శ్రీ నీరజ్** | ***సహాయకులు*** | **: శ్రీ శివరామకృష్ణ** |
| ***ఆహార్యం*** | **: శ్రీ పరమేశ్** | ***దుస్తులు*** | **: శ్రీ రాజు** |
| ***లైటింగ్*** | **: శ్రీ ముక్తేవి ప్రకాశరావు** | ***సెట్టింగ్స్*** | **: శ్రీ బాజ్జి, వసంతరావు** |

**ప్రస్తుతం 'అఖిల ఆర్ట్ థియేటర్స్'**
**(హైదరాబాద్) వారు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు.**

## నటీనట వర్గం

| | | | |
|---|---|---|---|
| 1. | మహాత్మాగాంధీ | : | శ్రీ మహర్షి రాఘవ |
| 2. | రాజారాం | : | శ్రీ రామక్రిష్ణ శాస్త్రి |
| 3. | యమధర్మరాజు, పేదల పార్టీ నాయకుడు, కల్లు సాంబయ్య | : | శ్రీ సమ్మెట గాంధీ/శ్రీ గోవర్ధనరెడ్డి |
| 4. | చిత్రగుప్తుడు, ఎమ్మెల్యే-1 | : | శ్రీ వేణునాధరావు |
| 5. | ఇంజనీర్, ఎమ్మెల్యే-3 | : | శ్రీ నగరాజారావు/ శ్రీశనగల కబీర్‌దాస్ |
| 6. | కాంట్రాక్టర్, ఎమ్మెల్యే-2 | : | శ్రీ భాసూరు వేణుగోపాలరావు |
| 7. | యాదగిరి / యాదమ్మ | : | శ్రీ జయప్రకాష్ రెడ్డి / శ్రీమతి తెలంగాణా శకుంతల |
| 8. | పి.ఎ., స్పీకర్ | : | శ్రీ శ్రీనివాస్ / శ్రీ అశోక్ / శ్రీ వెంకట్రాజు |
| 9. | సభాధ్యక్షుడు, పోలింగ్ ఏజెంట్, పోలీస్ కమీషనర్ | : | శ్రీ సుబ్బారావు / శ్రీ పద్మారావు |
| 10. | అధికార పార్టీ నాయకుడు | : | శ్రీ రఘునాథరెడ్డి / శ్రీ కోట శంకర్రావు / శ్రీ చిట్టాశంకర్ |
| 11. | ప్రతిపక్ష పార్టీ నాయకురాలు | : | శ్రీమతి నిర్మలారెడ్డి, ఐ.డి.పి.యల్. |
| 12. | రామరాజ్య పార్టీ నాయకుడు, జడ్జి | : | శ్రీ ముట్నూరి కామేశ్వర్‌రావు / శ్రీ చంద్రప్రకాశ్ రెడ్డి |
| 13. | పోలింగ్ ఆఫీసర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ | : | శ్రీ చాడ శర్మ |
| 14. | యమభటుడు, కానిస్టేబుల్ | : | శ్రీ వేణు |
| 15. | టి.వి. యాంకర్ | : | కుమారి అఖిలాండేశ్వరి |
| 16. | ఫోటోగ్రాఫర్, బెంచి గుమస్తా | : | శ్రీ సతీష్ |

***దర్శకత్వం : శ్రీమతి నిర్మలారెడ్డి, ఐ.డి.పి.యల్.***

***దర్శకత్వ పర్యవేక్షణ : శ్రీ జయప్రకాష్‌రెడ్డి***

***సంగీతం : శ్రీ రాజబాబు***

***దుస్తులు, ఆహార్యం : శ్రీ అశోక్‌పవార్***

***లైటింగ్ : శ్రీ ప్రకాశ్***

***రంగాలంకరణ : శ్రీ సురభిరాయలు***

# గాంధీ జయంతి
## (నాటకం)

### సీన్ నెం. 1

(యమలోకం – చిత్రగుప్తుడు, యమదూతలు యమధర్మరాజు రాకకోసం ఎదురుచూస్తున్నారు – వెనుక నుంచి స్వస్తి వాచకములు వినిపిస్తున్నాయి).

**ధర్మాధర్మ విచక్షణా దురంధర –**
**నిష్కళంక నిరుపమాన యశోధర – బహుపరాక్ – బహుపరాక్**

**సమస్త ప్రాణికోటీ సమవర్తీ**
**అసమాన ప్రతిభా తేజోమూర్తీ – బహుపరాక్ – బహుపరాక్**

**సకల జగజ్జన సంత్రాసక**
**సమయపాలన పరితోషక – బహుపరాక్ – బహుపరాక్**

(యమధర్మరాజు ప్రవేశించాడు)

**యమ :** చిత్రగుప్తా ! ఎన్నో దినముల నుంచి మమ్ములను ఒక సంశయం పీడించుచున్నది.

**చిత్ర :** ఏమది ప్రభూ !

**యమ :** ఇంతకాలముగా ఇన్ని విధములైన శిక్షలు విధించుచున్నాము కదా ! వారిలో ఏ ఒక్కరైనా మరుజన్మలో బుద్ధి కలిగి జీవించెనా?

**చిత్ర :** ఆ విషయము వారు తిరిగి మనవద్దకు వచ్చు వరకు తెలియదు ప్రభూ !

**యమ :** మనవద్దకు వచ్చిన తర్వాత తెలియుటకు ఇంకేమి ఉండును.

**చిత్ర :** ఏలనన, స్వర్గమున అనుభవించు సుఖములు గానీ, నరకమున అనుభవించు శిక్షలుగానీ మరుజన్మలో వారికి గుర్తుండవు ప్రభూ !

**యమ :** అహో ! ఎంత లోపభూయిష్టమైన విధానం !

**చిత్ర :** ప్రభూ !

**యమ :** అవును! మనం విధించు శిక్షల ప్రభావం మానవులపై ఎట్లున్నదో తెలుసుకొను అవకాశం మనకులేదు. వారనుభవించు శిక్షలను

గుర్తుంచుకొను వీలు వారికి లేదు. ఇది లోపభూయిష్టం కాదా!

**చిత్ర** : ప్రభూ! శిక్షా స్మృతిలోని శిక్షలను విధించుటయేకానీ వాటి మంచి చెడ్డలను విచారించు అధికారము మనకులేదు.

**యమ** : అందుకే నరకమున కొలువు......

**చిత్ర** : నరకముకన్నా హీనమైనది.

**యమ** : లెస్స....లెస్స....విచారణ ప్రారంభించెదము.

ఆది దేవ నమస్తుభ్యం
ప్రసీద మమభాస్కర
దివాకర నమస్తుభ్యం
ప్రభాకర నమోస్తుతే -

సప్తాశ్వరథమారూఢం - ప్రచండం - కశ్యపాత్మజం
శ్వేతపద్మధరం - దేవం - తంసూర్యం ప్రణమామ్యహమ్

(అని ధర్మాసనాన్ని అలంకరించి)

**యమ** : పాపులను ప్రవేశపెట్టుము.
(చిత్రగుప్తుడు గంట మోగించాడు - ఆ వెనుక కూర్చున్నవాడు ఇంకో గంట కొట్టాడు - నరకంలోని అగ్ని జ్వాలలు ఆరిపోయినవి.)

**యమ** : చిత్రగుప్తా ! ఏమీ వైపరీత్యం - హఠాత్తుగా వాతావరణం చల్లబడినది.

**చిత్ర** : (చుట్టూరా కలయతిరిగి) ప్రభూ! కొంపలంటుకున్నవి -

**యమ** : ఏమది ?

**చిత్ర** : అగడ్తలోని అగ్ని జ్వాలలు ఆరిపోయినవి ప్రభూ !

**యమ** : జ్వాలలు ఆరిపోయినవనుచున్నావు. కొంపలంటుకున్నాయని చెబుతున్నావు - పరిహాసమా!

**చిత్ర** : అదే అర్థం కాకున్నది ప్రభూ !
(గాంధీ ఇప్పుడు ప్రవేశించాడు)

**యమ** : (తనలో) మహాత్మా! దేవుడు ఎదుటపడితే మనిషి ప్రణమిల్లుతాడు. కానీ మీరు ఎదుటపడితే సాక్షాత్తూ ఆ దేవుడికే ప్రణమిల్లాలనిపిస్తుంది. అందుకోండి నా నమస్సులు.
(గాంధీ సమీపించాడు)

**యమ** : (లేచి) మహాత్మా స్వర్గంలో సుఖాలనుభవిస్తున్న మీకు అవ్యాజంగా మా మీద

దయ యెందుకు కలిగిందో! వచ్చిన కారణమేమిటో చెప్పండి. సేవించి తరిస్తాను.

**గాంధి :** ధర్మరాజా! నీ పిలుపుననే కదా నన్ను వీరు తీసుకువచ్చారు.

(యముడు చిత్రగుప్తుని వంక చూశాడు)

**చిత్ర :** (గాభరాగా) ప్రభూ! ఈయనే ఇప్పుడు విచారించవల్సిన పాపి!

**యమ :** చిత్రగుప్తా! నీకేమైన మతి చలించినదా?

**చిత్ర :** లేదు ప్రభూ! ఈ మనిషి చేసిన పుణ్యము కాలదోషము పట్టి పాపముగా మారినది. అందుచేతనే ఇంద్రులవారికి వినతి పంపి పిలిపించితిమి.

**యమ :** ఈ మహాత్ముడు పాపము చేయుటయా – ఏమది?

**చిత్ర :** తమరు ధర్మాసనమును అలంకరించిన మనవి చేయగలను.

**యమ :** క్షమించండి మహాత్మా! మిమ్ములను నేను విచారించు పాటివాడనా? అయినను ఉద్యోగ ధర్మము తప్పుట లేదు

**గాంధి :** ధర్మరాజా ! విధి నిర్వహణకన్న వ్యక్తి పూజ గొప్పది కాదు. నాకు స్వర్గమైనా నరకమైనా ఒక్కటే.

**యమ :** (వెళ్ళి సింహాసనం మీద కూర్చుని) చిత్రగుప్తా! ఈ మనిషి చేసిన పాపమేమి?

**చిత్ర :** (చేతిలో పుస్తకం గజగజ వణుకుతోంది) ఇతను మహాపరాధం చేసినాడు ప్రభూ!

**యమ :** ఏమది?

**చిత్ర :** భారతదేశమునకు స్వాతంత్ర్యము తెచ్చిపెట్టినాడు ప్రభూ!

**గాంధి :** దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడం మహాపాపమా?

**చిత్ర :** అవును మహాత్మా – (సర్దుకుని) అవును మానవా! మహాపాపమే! అన్న ప్రాసన రోజున ఆవకాయ అన్నము తినిపించవచ్చునా? శిక్షణ పూర్తి కాకుండానే నడపమని, వాహనమును యీయ వచ్చునా? నడక చేతకాని బాలుడ్ని పరుగు పందెములో పాల్గొనమని ప్రోత్సహించవచ్చునా? అదే విధంగా, రాచరిక వ్యవస్థలో యెన్నో యుగములు మగ్గిపోయి – వ్యక్తిపూజ, వంశ విధేయత వంటి జాడ్యములతో వున్న జాతికి – స్వాతంత్ర్యము యీయవచ్చునా? కుల విచక్షణతో, మత విద్వేషాలతో కుతకుత లాడుచున్న ఒక దేశంలో ప్రజాస్వామ్యము ప్రవేశపెట్టవచ్చునా? నిరక్షరాస్యులు అధికముగా యుండి, అక్షరజ్ఞానం వున్న ఆ కొద్దిమంది స్వార్థపరులై సంకుచితులై

ప్రవర్తించుచుండగా – ముఠా, వర్గ, మత, ప్రాంత, జిల్లా, రాష్ట్ర, భాష, వేష విభేదాలతో కొట్టుకు చస్తున్న నాయకులకు యీ దేశాన్ని పాలించమని అప్పగించవచ్చునా? ప్రభూ! జంతువును చంపితే నేరం! కాని యీ మనిషి స్వాతంత్ర్యము పేరుతో ఒక దేశాన్నే హత్యచేసే ప్రయత్నము చేసినాడు. అది పంచ మహాపాతకముల సమాహారమునకు సమానమైన మహాపాపం! అందుకు తగిన శిక్ష విధించమని ప్రార్ధన!

**యమ :** మనిషీ! నీ తరపున నీవు చెప్పునది యేమైనా ఉన్నదా?

**గాంధి :** ధర్మరాజా! ఏ పురుషుడూ తన ఆత్మ గౌరవాన్ని వదులుకుని వినయంగా జీవించకూడదు. ఏ స్త్రీ తన శీలాన్ని పణంగాపెట్టి కృతజ్ఞత వ్యక్తపరచకూడదు. ఏ దేశమూ తన స్వాతంత్ర్యాన్నీ సార్వభౌమత్వాన్నీ త్యజించి వుండకూడదు. అందుకే నా జాతికీ, దేశానికీ స్వాతంత్ర్యాన్ని సముపార్జించాను. అది మహాపాపమెలా అవుతుందో నాకర్థం కావడం లేదు.

**చిత్ర :** అఁ... అక్కడ మంట బెట్టి, పొగ వచ్చు సమయానికి నీవు పరలోకమునకు వచ్చితివికదా, నీకు అర్థము కాదులే!

**యమ :** చిత్రగుప్తా!

**చిత్ర :** ప్రభూ!

**యమ :** వాదోపవాదములు అనవసరము. అయోగ్యమైన ఒక జాతికి, అర్హతలేని ప్రజలకు స్వాతంత్ర్యము తెచ్చుటే కదా యీ వ్యక్తి చేసిన పాపము?

**చిత్ర :** అవును ప్రభూ!

**యమ :** కాని ఆ పాప ఫలితము గాని, దాని పరిణామము గాని కన్నులార చూచుటకు ఇతనికి అవకాశము లేకపోయినది. కనుక, ఇతను చేసిన పాపమునకు శిక్ష యేమనగా –

**చిత్ర :** భగభగ మండు అగ్ని గుండమునందు పడవేయుట!

**యమ :** చాలదు.

**చిత్ర :** గధాదండముతో శరీరము నుజ్జు నుజ్జగునట్లు పీడించుట!

**యమ :** కాదు

**చిత్ర :** ఏనుగులతో త్రొక్కించుట!

**యమ :** కానే కాదు.

**చిత్ర** : సలసల కాగు నూనె యందు పడవేసి, వేయించి చిత్రహింసకు గురి చేయుట!

**యమ** : చాలదు, చాలదు, చాలదు!

**చిత్ర** : చాలదు చాలదు యని శిక్షాస్మృతి యందున్న యే శిక్షయు కాకుండా యీతనిని శిక్షించుటెట్లు ప్రభూ?

**యమ** : ఈతడు తన జీవితాంతము కృషి చేసి యే జాతికి స్వాతంత్ర్యము తెచ్చి పెట్టెనో, లాఠీ దెబ్బలు తిని, కారాగారవాసము చేసి యే ప్రజలకు స్వేచ్ఛా వాయువులు ప్రసాదించెనో, యెన్నో త్యాగములు చేసి, నిందలు నిష్ఠూరములు మోసి ఈతడు యే దేశమునకు సార్వభౌమాధికారము సంపాదించెనో – ఆ దేశమునకు, ఆ ప్రజల మధ్యకు తిరిగి పంపవలయును! పంచ మహా పాతకములంటివి కదా, పంచ ఘటికా పర్యంతము ఈతడు అక్కడ గడుపవలయును!

**చిత్ర** : అనగా – అయిదు ఘడియలు మాత్రమా? అందునను స్వదేశమున?

**యమ** : అవును

**చిత్ర** : ఈ శిక్ష గురించి యెవరు విన్ననూ నవ్వి పోవుదురు ప్రభూ!

**యమ** : నవ్వి పోయినను, నివ్వెర పోయినను – యిదియే సరి అయిన శిక్ష! అయిదు ఘడియలనగా – మన దేశమాన ప్రకారము. వారి కాలమాన ప్రకారము –

**చిత్ర** : (అందుకొని) మానవ కాలమాన ప్రకారము, మన వొక దినము వారికి వొక మాసము; ముప్పది దినములగును ప్రభూ!

**యమ** : అవును. ముప్పది దినములు ఇతనిని భారతదేశమునకు పంపి, ఆ దేశంలోని ప్రజలు, నాయకులు యిప్పుడు యే విధముగా ఉన్నారో విస్పష్టముగా చూపించవలయును!

**చిత్ర** : అట్లు చూపించిన యేమగును ప్రభూ?

**యమ** : గుండె బ్రద్ధలగును. భక్తుని దుఃఖము చూసి భగవంతుడు, పిల్లల దౌర్భాగ్యము చూసి తల్లిదండ్రులు, ప్రజల పతనావస్థ చూసి నాయకులుపడు వేదనకన్న మిన్నయగు శిక్ష లేదు. శిక్ష అవశ్యము అమలు చేయవలయును!

(లైట్స్ ఆఫ్)

# సీన్ నెం. 2

(లైట్స్ వెలిగేయి. రంగస్థలం మీద ఒక ప్రక్కన గాంధీ విగ్రహం, దానిమెడలో పూలహారం కనిపిస్తున్నాయి. రంగు కాగితాలతో అలంకరణ ఆర్భాటంగా కనిపిస్తోంది. నేపథ్యంలో వందేమాతరం గీతం వినిపిస్తోంది. బయటనుంచి రాజారాం వచ్చేడు. గాంధీ విగ్రహం ముందు ఆగి, వినయంగా నమస్కరించేడు)

**రాజా :** మహాత్మా! ఈ రోజున నీ జయంతి! దేశమంతా ఉత్సవాలు, ఊరేగింపులు, సంబరాలు, వందేమాతరం గీతాలు! యెక్కడ చూసినా పండగే! నిన్ను మరిచిపోకుండా యీ జాతి యెంతగా గుర్తు పెట్టుకుందోనని అనిపిస్తోంది, యీ ఆర్భాటం చూస్తే! కానీ రేపట్నుంచీ మామూలే! ఇక్కడ నీ సమాధివైపు కన్నెత్తి చూసే వారుండరు – చుట్టూ పెరుగుతున్న ముళ్ళ పొదలు తప్ప! వాళ్ళ స్వలాభం కోసమో, పబ్లిసిటీ కోసమో తప్ప నీ విగ్రహం మెడలో దండ కూడా యే నాయకుడూ వెయ్యడు! స్వాతంత్ర్య పోరాటంలో నీతో కలిసి పనిచేసి, నీతో జైల్లో సహవాసం చేసిన మాకు, యీ ఆత్మ వంచనా కార్యక్రమం బాధ కలిగిస్తోంది. మాకు మాత్రం, నువ్వు దూరమైపోయినా ఆనాటి నీ మాటలు, ఉపన్యాసాలు యింకా హృదయాల్లో మ్రోగుతూనే వున్నాయి. కన్ను మూస్తే ఉప్పు సత్యాగ్రహం, కన్ను తెరిస్తే క్విట్ ఇండియా ఉద్యమం కదలాడతాయి. కానీ యింకెన్నాళ్ళు? నీ దగ్గరకు వచ్చే సమయం దగ్గర పడుతోంది. నిన్ను మళ్ళీ యీ భూమ్మీదకు రప్పించుకోలేను గానీ, నీ దగ్గరకు రాగలను – వచ్చేస్తాను! నువ్వు అదృష్టవంతుడివి. కాబట్టే స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వెళ్ళిపోయావు...బతికిపోయావు.

(రఘుపతి రాఘవ రాజారాం అనుకుంటూ సమాధికి నమస్కరించి ధ్యానంలో వుంటాడు. ఉరుములు, మెరుపులు...సమాధి పగిలింది. గాంధీ సమాధి నుండి బ్రతికి బయటికి వస్తున్నాడు. ఆయన్ని చూడగానే రాజారాం పరమానందభరితుడైపోయేడు)

**రాజా :** మహాత్మా! నువ్వు బ్రతికావా? మళ్ళీ వచ్చావా? ఈ దేశం కోసం, యీ ప్రజల కోసం... మళ్ళీ వచ్చావా?

**గాంధి :** నువ్వూ...???

**రాజా :** నేను మహాత్మా! రాజారాంని...యెరవాడ జైలులో మీతోపాటు...

**గాంధి :** అంటే...

**రాజా :** అదే...లొడలొడ వాగుతూ, చరచరా తిరుగుతూ వుండేవాడ్ని. నా వురుకులూ పరుగులూ చూసి, యీ దేశంలో ప్రతి ఇంటిలోనూ చరఖా నీలాగా తిరగాలి, అలా తిరిగితే పేదరికమనేది వుండదు అనేవారు.

**గాంధి :** Oh! yes! yes! That quick-witted sharp-tongued young fellow from...Bezwada?

**రాజా :** (ఆనందంతో) హమ్మయ్య గుర్తు పట్టేశారా! (కాళ్ళకు నమస్కారం చేశాడు)

**గాంధి :** ఆఁ! గుర్తుకొస్తోంది. నువ్వు చలాకీగా తిరుగుతూ, అందరికీ తలలో నాలుకలా ఉండేవాడివి...కానీ (నవ్వుతూ) రణపెంకెవి...అప్పుడప్పుడూ నేను, నీ చెవి మెలి వేశేవాణ్ణి కదూ... (చెవి మెలిపెట్టాడు)

**రాజా :** అవును బాపూజీ.

**గాంధి :** ఆ! ఇంకో విషయం గుర్తుకొస్తోంది...నువ్వు నాకు Telugu alphabets నేర్పావు కదూ!

**రాజా :** ఆ! మీరు నాకు హిందీ మాట్లాడటం నేర్పారు.

**గాంధి :** (తృప్తిగా నవ్వుతూ) What news young man?

**రాజా :** ఇంకా యంగ్ యేవిఁటి బాపూజీ, ముసలివాడ్నయిపోతే!

**గాంధి :** ముసలితనం శరీరానికే గాని, నీ మనసుకి వచ్చి వుండదు. How are you?

**రాజా :** ఠీక్ హూఁ బాపూజీ!

**గాంధి :** ప్రజలంతా క్షేమంగా వున్నారా?

**రాజా :** తినబోతూ రుచి అడగడమెందుకు బాపూ?

**గాంధి :** పాలకులు?

**రాజా :** వాళ్ళ నోటిలో నిత్యం మీ పేరే ! మిమ్మల్ని గుర్తుకు తెచ్చుకోని క్షణముండదు. ఇదిగో యీ ఆర్భాటం, అలంకరణ యిదంతా మీ కోసమే!

**గాంధి :** నా కోసమా! నన్నింకా మర్చిపోలేదన్నమాట! (చాలా సంతోషంతో అలంకరణలన్నీ చూశాడు...) కానీ నేను వస్తున్నట్లు వాళ్లకెలా తెలుసు?

**రాజా :** ఇవాళ మీ జయంతి బాపూజీ.

**గాంధి :** What?

**రాజా :** Yes? ఇవాళ 'గాంధీ జయంతి' బాపూ.

**గాంధి :** అంటే Today is the 2nd of October?

రాజా : Yes.

గాంధీ : అంటే మళ్లీ ఇదే రోజున ఈ భూమ్మీదికి వచ్చానన్నమాట. History repeats after all - చరిత్ర పునరావృతం అవుతుంది.

రాజా : బాపూ...పాపము శమించుగాక

గాంధీ : Whatever it is I am very happy చాలా సంతోషంగా వుంది, రాజారాం!

రాజా : అబ్బే – అప్పుడే అంత యిదైపోకండి.

గాంధీ : ఏం?

రాజా : కోపాన్ని కంటి చాటున, సంతోషాన్ని పంటి బిగువున వుగ్గబట్టాలనే వారు కదా, అందుకు !

గాంధీ : నా మాటలింకా నీకు గుర్తున్నాయా?

రాజా : నాకే కాదు, యీ దేశంలో మీ మాటలు నిత్యం ప్రతిధ్వనిస్తుంటాయి. – మీ బాటలే చెదలు పట్టాయి – అప్పుడు పన్నులు కట్ట వద్దన్నారు కదా!

గాంధీ : అవును.

రాజా : ఆ మాటలు అలాగే గుర్తు పెట్టుకుని ఆస్తి పన్నులు, ఆదాయపు పన్నులు, కరెంటు ఛార్జీలు, వాటర్ ఛార్జీలు పెద్దవాళ్ళెవరూ కట్టడం లేదు. అవి యెగ్గొట్టడానికి అనేకమైన అడ్డదారులు, దొడ్డిదారులు కనిపెట్టేశారు.

గాంధీ : అదేవిఁటి? అది పరాయి ప్రభుత్వం కాబట్టి అలా అన్నాను.

రాజా : ఇది స్వంత ప్రభుత్వం కాబట్టి యిలా చనువు తీసుకుంటున్నారు.

గాంధీ : పన్నులు కట్టకపోతే ప్రభుత్వం యెలా నడుస్తుంది?

రాజా : అది నడవడం లేదు బాపూజీ! పరిగెడుతోంది.

గాంధీ : ఎక్కడికి?

రాజా : World Bank దగ్గరికి!

గాంధీ : ఎందుకు?

రాజా : అప్పు కోసం !

గాంధీ : తప్పు కాదూ?

రాజా : గొప్పని మనవాళ్ళ ఉవాచ!

గాంధీ : మరి, సత్యం అహింసలు?

రాజా : గగన కుసుమాలు అయిపోయేయి

గాంధీ : ఆఁ....

రాజా : రండి బాపూ! అనుభవమైతే తప్ప తత్వం బోధ పడదంటారు. మీరు స్వయానా

చూస్తేనే గాని అవగాహన కాదు. పదండి వెడదాం.

(ఇద్దరూ బైటికి నడిచేరు. కొద్దిక్షణాల తర్వాత, ఇంజనీర్ హడావిడిగా వచ్చేడు)

**ఇంజనీరు:** ఆ కాంట్రాక్టర్ని రమ్మనవయ్యా! ఆ కాంట్రాక్టర్ని రమ్మను! (మరో పక్క నుండి కాంట్రాక్టర్ వచ్చాడు)

**కాంట్రా :** నమస్తే సార్! నేనిక్కడే వున్నాను.

**ఇంజనీరు:** నువ్విక్కడే వున్నావ్ – చెయ్యాల్సిన పనులు యెక్కడివక్కడే వున్నాయ్. ఏంటయ్యా యిదీ – యేంటీ? షామియానాలు వెయ్యలేదు. కుర్చీలు వెయ్యలేదు. అటు చూడు. ఆ రోడ్డుకి ఆ పక్కా యీ పక్కా వున్న ముళ్ళ తుప్పలు తీయలేదు. ఏం పనయ్యా యిది – యేం పని? (అక్కడ పడి వున్న ఒక ఖాళీ బీరు బాటిలు చూశాడు) ఏంటయ్యా ఇది?

(కాంట్రాక్టరు నాలుక కరుచుకుని బాటిల్‌ను దూరంగా పారవేసి వచ్చాడు)

**ఇంజనీరు:** ఆ గాంధీ బొమ్మకి రంగేయమన్నాను – వేసేవా?

**కాంట్రా :** వేశాను సార్!

**ఇంజనీరు:** అదేం రంగయ్యా? అసలది రంగా లేకపోతే కాకి రెట్టలమీద నీళ్ళుచల్లి తెల్ల రంగేశాను అంటున్నావా?

**కాంట్రా :** ఏంటి సార్ ఆ మాటలు! ఎక్కడైనా మోసం చేస్తాను గానీ, గాంధీ బొమ్మమీద కూడా మోసం చేస్తానేంటండీ?

**ఇంజనీరు:** చాల్లే గొప్ప చెప్పొచ్చావ్! ఆ విగ్రహం పెట్టి ఆర్నెల్లయింది. దాని తాలూకుది యిప్పటివరకివ్వలేదు. పైగా నీతి కబుర్లొకటి.

**కాంట్రా :** ఇదిగోండి యీ మాటలే నాకు నచ్చవ్. గాంధీగారి మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. ఆ విగ్రహం కాంట్రాక్టులో ఒక్క పైసా తింటే ఒట్టు!

**ఇంజనీరు:** నిజం చెప్పవయ్యా. విగ్రహం మూడు లక్షలవుతుందా? తస్సాదియ్యా – నడుంకి వో గావంచా కట్టుకుని, ఓ కర్ర పట్టుకుని నిలబడ్డ బొమ్మకు మూడు లక్షలా? దాని కింద కట్టిన దిమ్మకు రెండు లక్షలా! ఇంత డబ్బు తినేసి నాకో పది వేలిస్తానని మాటిచ్చి, ఇవ్వకపోగా, నాకేం మిగల్లేదంటావా? పురుగులు పడి ఛస్తావ్!

**కాంట్రా :** చూడండి సార్! ఆ బొమ్మకిచ్చిన డబ్బులో గానీ, దానికింద దిమ్మకిచ్చిన డబ్బులోగాని, పైసా మిగల్లేదు. పైగా నా చేతి చమురు పదివేలు వదిలిందంటే – నమ్మండి!

**ఇంజనీరు:** ఇదిగో, నువ్వేమన్నావ్?... ఈ గాంధీ జయంతి వర్క్ నాకివ్వండీ, పాత బాపతు పదివేలూ అడ్జస్ట్ చేస్తాను అని నువ్వనలేదూ?

**కాంట్రా :** అన్నానండీ!

**ఇంజనీరు:** నువ్వలా అన్నందుకే కదా, యీ వర్క్ నీకొచ్చేలా చేశాను.

**కాంట్రా :** చాలా థాంక్స్ కానీ అసలు విషయం మీకు తెలీదు.

**ఇంజనీరు:** ఏంటో అది?

**కాంట్రా :** మన MLA గారు ఆ సెవెన్ రోడ్స్ జంక్షన్‌లో వాళ్ళ నాన్న గారి విగ్రహం పెట్టించారు కదా?!

**ఇంజనీరు:** అవును!

**కాంట్రా :** ఆ విగ్రహం యెంతయిందనుకున్నారు?

**ఇంజనీరు:** ఎంత?

**కాంట్రా :** మూడు లక్షలు!

**ఇంజనీరు:** అవునా?

**కాంట్రా :** అవునండీ! మరి ఆ విగ్రహం డబ్బు MLA గారు యిచ్చాడనుకుంటున్నారా?

**ఇంజనీరు:** ఇచ్చేవుంటాడు.

**కాంట్రా :** ఇవ్వలేదండీ బాబూ! ఆ విగ్రహం డబ్బు ఈ గాంధీగారి విగ్రహంలో కలిపేశాడు. బిల్లు ఒకటి – విగ్రహాలు రెండు! మీరేమో కిందనుండి పైవరకు ఆ డబ్బిచ్చావు కాదు – ఆ డబ్బిచావు కాదు అని గొడవ చేస్తే యెక్కడి నుంచి తెచ్చివ్వమంటారు?

**ఇంజనీరు:** స్సరే... యీ గాంధీ జయంతిది యిప్పుడిచ్చేసెయ్!

**కాంట్రా :** ఇప్పుడా!

**ఇంజనీరు:** ఇప్పుడే! లేదంటే ఏ ఎమ్మెల్యేనో, ఛైర్మనో అతని జయంతి జరిపించుకొని ఆ ఖర్చు యీ గాంధీ జయంతిలో కలిపేశాడనుకో–

**కాంట్రా :** (జేబులోంచి డబ్బులు తీస్తూ) ఎంతయినా ఆ రోజుల్లో ఆఫీసర్ల తీరే వేరుసార్!

**ఇంజనీరు:** ఏంటో అది?

**కాంట్రా :** అప్పుడు డబ్బుకోసం యింత యిది లేనే లేదు.

**ఇంజనీరు:** ఆ సంగతి మాకూ తెల్సు! అప్పుడెవరికీ యింత టెన్షన్ లేదు. ఆ రోజుల్లో ఆఫీసర్లకి అధికారాలు, హోదాలు, గౌరవం, మర్యాద, డిగ్నిటీ – యీవినింగ్ అయితే క్లబ్బులు, టెన్నిస్, షటిల్, పార్టీలు, పండుగలు! మరిప్పుడో? ఈ

రోజుల్లో ఆఫీసర్లకి ఎంక్వయిరీలు, కమిషన్లు, చీవాట్లు, ఛీత్కారాలు, బీపీలు షుగర్లు! ఓ పండగ లేదు, పబ్బం లేదు, ఇంటికెళ్ళే సరికి రోజూ రాత్రి పదకొండు – పన్నెండు! ఇక యీ చిలక్కొట్లు కూడా లేవనుకో – నా పెళ్ళాం సరిగ్గా కాపురం చేయదు! (ఇంతలో గాంధీ, రాజారాం వచ్చారు)

**రాజా :** (ఇంజనీరుతో) చూడు బాబూ..

**ఇంజనీరు:** చూశాను! ఏంటీ?

**రాజా :** ఈయన గాంధీగారు

**ఇంజనీరు:** (ఎగాదిగా చూసి) అలాగే వున్నాడు.

**రాజా :** అలాగే వుండటం కాదు బాబూ! ఈయనే అసలు గాంధీగారు. ఇప్పుడే వచ్చారు.

**ఇంజనీరు:** మరి కాసేపాగితే, నెహ్రూ వస్తాడు, శాస్త్రి వస్తాడు, సుభాష్ చంద్రబోసూ వస్తాడు. ఈ పగటి వేషగాళ్ళందరికీ అదిగో అక్కడ షామియానాలో కుర్చీలు వేశాం. వెళ్ళి కూర్చోండి.

**రాజా :** ఈయన పగటి వేషగాడు కాదు, నిజంగా గాంధీయే!

**ఇంజనీరు:** (గాంధీ వంక చూసేడు)

**గాంధి :** యెస్

**ఇంజనీరు:** అయితే ఏంటట?

**గాంధి :** నేను కలెక్టర్ గారితో మాట్లాడాలి.

**ఇంజనీరు:** ఏమని?

**గాంధి :** నన్ను ఢిల్లీ పంపించే యేర్పాటు చెయ్యమని చెప్పాలి.

**ఇంజనీరు:** ఎందుకూ?

**గాంధి :** నేను ప్రధానమంత్రిని కలవాలి.

**ఇంజనీరు:** వామ్మో! పిచ్చి బాగా ముదిరినట్లుంది.

**రాజా :** ఆయన పిచ్చివాడు కాదు! నిజంగా గాంధీయే!

**ఇంజనీరు:** (వ్యంగ్యంగా) ఆఁహా! ఆయన గాంధీ, మరి నువ్వో?

**రాజా :** నేను రాజారాంని! మేఁవిద్దరం కలిసి ఎరవాడ జైల్లో శిక్ష అనుభవించాం!

**ఇంజనీరు:** (నవ్వి) ఇదుగో గాంధీ పాఠం చెప్పవయ్యా!

**కాంట్రాటా :** 'గాంధీగారు అక్టోబర్ రెండు, 1819 సంవత్సరంలో, పోరుబందరులో జన్మించిరి. 1948 జనవరి 30వ తేదీన, గాడ్సే అను దుర్మార్గుని చేతిలో

మరణించిరి. ఆయన పవిత్ర స్మృతి చిహ్నంగా అన్ని స్టేట్ కాపిటల్స్‌లో సమాధులు నిర్మించిరి.

**ఇంజనీరు:** ఇది పాతం ! అలాంటప్పుడు ఇతనెవరు?

**రాజా :** మీరు చెప్పిందంతా నిజమే! కానీ ఈయనే మహాత్మ గాంధీ!

**ఇంజనీరు:** చంపుతున్నార్రా పిచ్చినాకొడకల్లారా! స్సరే బాబూ – ఇతనే మహాత్మాగాంధీ, ఇప్పుడే ఆ సమాధి పగలగొట్టుకొని బ్రతికి బయటికి వచ్చాడు.

**రాజా :** అవునవును!

**ఇంజనీరు:** ఏంటి అవునవును? ఒక్కటిచ్చానంటే మళ్ళీ – యేదో ముసలి వాళ్ళు కదాని విడచి పెడ్తున్నాను. ఇదిగో యీ ఇరవై తీసుకుని బయటికి పొండి. (ఇరవై రూపాయలు గాంధి చేతిలో పెట్టాడు) (కాంట్రాక్టర్‌తో) వాళ్ళను తీసుకెళ్ళవయ్యా!

**రాజా :** ఆయన నిజంగా గాంధీ అంటే నమ్మరేం?

**ఇంజనీరు:** ఏంట్రా ముసలోడా గట్టిగా అరుస్తున్నావ్? ఒళ్ళెలా వుంది?

**రాజా :** అమర్యాదగా మాట్లాడకండి

(ఇంతలో బైట నుండి కారు హారన్ వినిపించింది)

**ఇంజనీరు:** అమ్మో ఎమ్మెల్యే గారొచ్చేసారు. నన్నిక్కడ చూశాడంటే నవిలేస్తాడు. వీడికి దొరికేకన్నా ఇన్‌కంట్యాక్స్ వాడికి దొరకడం బెటరు. (కాంట్రాక్టరుతో) నేనెళ్తున్నాను. నువ్ మేనేజ్ చేసెయ్... వస్తా! (వెళ్ళిపోయాడు)

**కాంట్రా :** ఎమ్మెల్యే గారు వచ్చేశారు. స్కూలు పిల్లలందర్నీ రమ్మనండి...ఇదుగో ఆ మైకు ఇలా తీసుకురావయ్యా...(మైకులో) ఇప్పుడు బాలబాలికలచే దేశభక్తి గీతాలు పాడించబడును. రండి, రండి...

(ఎమ్మెల్యే యాదగిరి పి.ఏ. లోపలికి వస్తూ)

**పి.ఏ. :** నో....నో... ఏ కల్చరల్ ప్రోగ్రామ్ అయినా ఎమ్మెల్యే గారి ఉపన్యాసం తరవాతనే.

**కాంట్రా:** అది గాదు సార్...గాంధీ జయంతి...దేశ భక్తి గీతాలు

**పి.ఏ :** నథింగ్ డూయింగ్...ఇంకా ఎమ్మెల్యే గారు మూడు చోట్ల ఉపన్యాసాలివ్వాలి.

(ఎమ్మెల్యే యాదగిరి, అధ్యక్షుడు, కార్యకర్త వస్తారు)

**పి.ఏ :** ఇదిగో కుర్చీలు తెప్పించండి.

(కుర్చీలలో ఆసీనులయ్యారు)

**పి.ఏ :** (కార్యకర్తతో) దండ...మాలా...గార్లెండ్...

(కార్యకర్త దండ తెచ్చి యాదగిరికి ఇవ్వబోతాడు. యాదగిరి ఆ మాల తనకే అనుకుని వినయంగా తల వంచుతాడు. పి.ఏ. మోచేత్తో పొడిచి గాంధీ విగ్రహంవైపు చూపిస్తాడు. ఎమ్మెల్యేకి అర్థమయింది. నాలిక్కరచుకుని ఆ దండ తీసుకొని గాంధీ విగ్రహం మెళ్ళో వేసి నమస్కారం చేసి వస్తాడు.

ఫోటోగ్రాఫర్ ఫోటో తీస్తాడు.

పువ్వులు, పువ్వులు అని పి.ఏ. కార్యకర్తకి సైగ చేస్తాడు. కార్యకర్త పూలు తీసుకువస్తాడు. మళ్ళీ ఎమ్మెల్యే తలవంచి నిలబడతాడు వినయంగా... మళ్ళీ పి.ఏ. మోచేత్తో పొడిచి సమాధివైపు సైగ చేస్తాడు. ఎమ్మెల్యేకి అర్థమయింది. పువ్వుల్ని దోసిలితో తీసుకొని గాంధీ సమాధిమీద వేస్తాడు. అధ్యక్షుడు కూడా సమాధి మీద పూలు వేస్తాడు.

మళ్ళీ పి.ఏ. దండ..దండ అని సైగ చేస్తాడు. కార్యకర్త తెస్తాడు. ఎంఎల్ఏ దగ్గరికి వెళ్తాడు. ఎమ్మెల్యే ఆ దండ తీసుకుని పి.ఏ.వైపు తిరిగి "ఇదెవరికి ఎయ్యాల.." అంటాడు. పి.ఏ...అది నీకే అన్నట్టుగా సైగ చేస్తాడు. ఎమ్మెల్యే నాలిక్కరుచుకుని "అట్టనా" అంటూ, ఆ దండ కార్యకర్తకి తిరిగి ఇచ్చేసి, తల వంచి నిలబడ్తాడు. కార్యకర్త దండ వేస్తాడు. అందరూ చప్పట్లు)

**అధ్య** : ఇప్పుడు పేదల పాలిట పెన్నిధి, ప్రజాబంధువు, మన ప్రియతమ శాసన సభ్యులు ఎమ్మెల్యే యాదగిరిగారు – గాంధీగారి వ్యక్తిత్వం గురించి, గుణగణాల గురించి, ఆయన అహింసావాదం గురించి సందేశం వినిపిస్తారు.

(జనం చప్పట్లు కొట్టారు. యాదగిరి లేచి అందరికీ నమస్కరించాడు)

**యాద** : సోదర సోదరీమణులారా! నా ప్రియాతి ప్రియమైన అభిమానులారా! అందరికీ దండం! దేశంలో హింస పెరిగిపోయిందంటారు. కానీ నేనందుకు ఒప్పుకోను మల్లా! ఎందుకంటే, మనిషి సహజంగా పుడ్తున్నడా? లేదే! ఎంతమంది తల్లులు సిజేరియన్ ఆపరేషన్ లేకుండా బిడ్డల్ని కంటున్నరో చెప్పమనుండ్రి? తల్లి కడుపుకి కత్తివేటు పడితేగాని మనిషి భూమ్మీద పడ్డంలేదు. మరో కత్తిపోటుతోని చస్తున్నడు! ఇందులో తప్పేముంది? సహజంగా పుట్టనోల్లకి సహజంగా చచ్చే హక్కు యాడనుంచి వస్తది? అందుకే యాదగిరి అంటడు – రెండు కత్తిపోట్ల మధ్యనున్న బతుకే జీవితం అని! (చప్పట్లు) ఇగపోతే – ఈ పొద్దు గాంధీ...గాంధీ సార్‌ది.

**అధ్య** : జయంతి!

**యాద** : అంటే పుట్టిన్రోజె కద? ...అది జరుపుకుంటున్నాం!

**పీ.యే** : (వెనకనుండి ముందుకు వంగి) శాస్త్రి గారిది కూడా యీ రోజేనండీ!

**యాద** : శాస్త్రిరా? అంటే... ఆ మ్యాచ్ ఫిక్సింగ్‌ల దొర్కిపోయినోడేనా?

**పీ.యే** : కాదండి. ఆ శాస్త్రి కాదు!

**యాద** : అయితే ఈ శాస్త్రి ఆ మ్యాచ్‌ఫిక్సింగ్‌ల లేదన్నమాట! అయినా యీ మ్యాచ్

ఫిక్సింగ్ అనేడిది యిప్పుడు కొత్తగ వచ్చిందేం కాదు! పాతకాలం నుంచి మనదేశంల వున్నదె! ఆనాడు, శకుని పాచికలాడతా కౌరవులకెల్లి మ్యాచ్ ఫిక్సింగ్ చేసిండు. దేనికి? పగ తీర్చుకోనీకి! కురుచ్చేత్ర యుద్ధంల అందర్‌గూడ కౌరవుల పక్క ఫైటింగ్ చేస్తూ, పాండవులకెల్లి మ్యాచ్ ఫిక్సింగ్ చేసిన్రు! ఇక యీ శాస్తిరి –

**పీ.యే :** సార్, యీ శాస్త్రి – రవిశాస్త్రి కాదు, లాల్ బహదూర్ శాస్త్రి!

**యాద :** రేయ్ గమ్మునుండు! రవిశాస్త్రికి – లాల్ బహదూర్ శాస్త్రికి తేడ తెలీదనుకుంటున్నవా నాకు? అరె – మాటొచ్చింది గన్క మ్యాచ్ ఫిక్సింగ్ గురించి చెప్తున్న! … ఇకపోతే –

**పీ.యే :** సార్! గాంధీగారితోపాటు, శాస్త్రి గారు కూడా యీ రోజే పుట్టారు.

**యాద :** నాకర్థమైంది. దేశమిట్ట తగలబడినప్పుడే నాకర్థమైంది! గిట్ల మంచోళ్ళందరు ఇద్దరేసి చొప్పున ఒక దినంలా పుడ్తావుంటే, చెడ్డోళ్ళు నల్గురేసి చొప్పున పుట్టరా మల్ల? మంచోళ్ళు పాండవులు ఐదుగురు పుడ్తె, కౌరవులు వంద మంది బుట్టిరి! వన్ యీస్టూ టొంటీ! అన్నట్టు మాటల్లబడి మర్చిపోయిన – తొందర్ల స్తానిక సంస్థలకు యెలచ్చన్లు జరగబోతున్నయ్! మీరందరూ మా పార్టీకి వోట్లేసి గెలిపియ్యాలని కోరుతున్న !

**పి.యే :** భూపోరాటం గురించి చెప్పండి సార్.

**యాద :** అరెచుప్ ! పోరాటం జేస్తే భూమొస్తాది? కబ్జా చేస్తే వస్తాది గానీ, పోరాటంజేస్తే భూమిరాదుగానీ ప్రాణాలు పోతాయ్.

**పి.యే :** గాంధీగారి గురించి చెప్పండి సార్!

**యాద :** చెప్తా చెప్తా! ఆడకే వస్తున్న! గాంధీసార్ మహా గొప్పోడు యెట్లయిండు? ఆనాడు తెల్లదొరలు పాలిస్తుండిరి కన్క! ఆళ్ళు పెజల్ని పందుల్లెక్క – కుక్కల్లెక్క చూస్తుండిరి గన్క! పోలీసోళ్ళను పెట్టి మస్తుగ కీళ్ళు యిరగ్గొటిస్తుండిరి గన్క! దొర్కిందంత దోచుకపోతా వుండిరి గన్క! గా పరిస్థితి చూసే, ఓ గాంధీ పుట్టిండు! ఓ నెహ్రూ పుట్టిండు! ఓ శాస్త్రి తయారైండు! అప్పుడే గన్క పరిస్థితులు సక్కగ వుండుంటె, యెవల్లకు యే కస్టం లేకుండుంటె, యీ గొప్పోలంత పుడ్తరా? పుట్టి యేం పీక్తరు? పుట్టరు గాక పుట్టర్! ఇపుడు కూడ, పెజల్ని కాల్చుక తింటావుంటె, పీడిస్తావుంటె – గది జూసి వో గాంధీ పుడ్తడు, ఓ నెహ్రూ పుడ్తడు. గందుకని నే చెప్పేడిదేందంటే – గాంధిసార్ పుట్టనీకి

యీ దేశాన్నెపుడూ సిద్ధంగా వుంచాల! (జనం గోల) ఒకేల కొత్త గాంధీ పుట్టుడు మీకిష్టం లేకుంటె, పాతగాంధీనే మల్ల బతికొచ్చేట్టు చేస్కుందం! (గాంధీ, రాజారాం అక్కడికి వచ్చారు)

**రాజా :** ఇదిగోనండీ... గాంధీగారు మళ్ళీ బ్రతికి వచ్చారు.

**యాద :** ఆగు..ఆగు..(గాంధీ దగ్గరకు వచ్చి పరకాయించి చూసి) ఓర్నీ... నిజంగ గాంధీ లెక్కన ముచ్చటగున్నడు!

**రాజా :** ఈయన సాక్షాత్తూ మన మహాత్ముడు!

**యాద :** దేవుడు పెద్ద కంత్రీయెదవయ్యా! ఒకే పోలికన మందిని బలే పుట్టిస్తడు!

**రాజా :** మహాత్మా! మీరైనా చెప్పండి!

**గాంధి :** I am MK Gandhi !

**యాద :** నిజ్జం ?

**గాంధి :** యెస్!

**యాద :** నిజం! ఈన ఎంకే గాంధీ! కాని మహాత్మాగాంధి కాదు మల్ల.

**గాంధి :** I am Mohandas Karamchand Gandhi!

**యాద :** ఒప్పుకుంటున్నబయ్! నువ్వు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీయే! కాని మహాత్మా గాంధీ మాత్రం కాదు.

**రాజా :** మోహన్‌దాస్ కరంచంద్ గాంధీయే మహాత్మాగాంధీ!

**యాద :** ఏయ్ చుప్! దిమాగేమైన ఖరాబైందా – లేకుంటె నేనేమైన పాగల్‌గాని లెక్కన కనబడ్తన్ననా? ఇతను మోహన్‌దాస్ కరంచంద్ గాంధీయే గానీ – మహాత్మాగాంధి మాత్రం కాదు.

**గాంధి :** I am -

**యాద :** ఇగో వో ముసిలోడా! ఊకె లొల్లి పెట్టకు! అసెంబ్లీల మంత్రికూడ నా మాటకిన్ని సార్లు యెదురు చెప్పలే!

**రాజా :** ఎదురు చెప్పడం కాదు – ఆయన నిజంగా మహాత్మాగాంధీయే! నన్ను నమ్మండి.

**యాద :** నువ్వేమైన పదవిల వున్నవా పచ్చి అబద్దాలు చెప్తె నమ్మనీకి? ఇగో – నేను రిగ్గింగ్ చెయ్యకుండ గెల్చినని చెప్పు – నమ్ముత! పైసల్ తీస్కోకుండ పన్లు చేస్తున్ననని చెప్పు – నమ్ముత! దొంగసార అమ్మడం లేదని చెప్పు – నమ్ముత! గంతెగాని, యితడు మహాత్మాగాంధి అంటే నమ్మ, నమ్మ, నమ్మ! ఇతడు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీయే! మహాత్మా గాంధీ కాడుమల్ల.

**రాజా :** అది కాదు, నేను చెప్పేది వినండి!

**యాద :** రేయ్! ఈల్లనీడకెల్లి నూకండ్రా!

(లైట్స్ ఆఫ్)

## సీన్ నెం. 3

(లైట్స్ ON అయేసరికి, గాంధీగారు, రాజారాం టి.వి.లో వస్తున్న న్యూస్ చూస్తున్నారు)

**వార్త :** ఈ నెల మూడో తారీఖున జరగబోయే ఉప ఎన్నికల్లో, ప్రధాన పార్టీలు రెండూ ఒకరిమీద ఒకరు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నాయి.

టి.వి.లో ప్రతిపక్ష నాయకురాలు బొమ్మ వచ్చింది.

**ప్ర.ప.నా:** వాళ్ళు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి అడ్డమైన దారుల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే ఎన్నికల అధికారికి మెమోరాండం సమర్పిస్తున్నాం. ఎన్నికలు న్యాయంగా, నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని కోరుతున్నాం. గవర్నర్‌కి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కి మెమోరాండం సమర్పించాలని అనుకుంటున్నాం.

**వార్త :** దీనిపై స్పందిస్తూ – అధికార పార్టీ ప్రతినిధి ఇలా వ్యాఖ్యానిస్తున్నారు. (టి.వి.లో అధికార పార్టీ నాయకుడి బొమ్మ వచ్చింది.)

**అ.పా.నా:** ప్రతిపక్షం వాళ్ళెన్ని అక్రమాలకు పాల్పడుతున్నారో, ప్రజలు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వాళ్ళకి బుద్ధి చెబుతారు. మేం మాత్రం ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని కోరుకుంటున్నాం. దళితుల్ని, బలహీన వర్గాలవారినీ వాళ్ళ ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుపడుతున్నారు. అందుకే మాకు న్యాయం చెయ్యమనీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడమని – గవర్నర్‌కి, ఎలక్షన్ కమీషన్‌కి విజ్ఞప్తి చేస్తున్నాం. వాళ్ళెంత అరాచకం సృష్టించినా ప్రజలు మా ప్రక్కనే వున్నారు. మేం తప్పకుండా గెలిచి తీరతాం (T.V. ఆఫ్ అయ్యింది)

**గాంధి :** రాజారాం!

**రాజా :** అయ్యా!

**గాంధి :** రెండు పార్టీలు ఎన్నికలు న్యాయంగా జరగాలని కోరుకుంటున్నప్పుడు – అసలు అన్యాయానికి ఒడిగట్టేది ఎవరయ్యా?

**రాజా :** ఎలక్షన్ కమిషన్!

**గాంధి :** అం.. ఏవంన్నావ్?

**రాజా :** అహం - యేం లేదు.

**గాంధి :** నిజంగా నాకు చాలా సంతోషంగా వుంది. రాజారాం!

**రాజా :** ఎందుకు మహాత్మా?

**గాంధి :** ఎందుకేవింటి? ప్రజాస్వామ్యం కోసం ఎంత పరితపిస్తున్నారు మన నాయకులు!

**రాజా :** చాలా! (ఈలోగా ఇద్దరు వ్యక్తులు వచ్చి చిన్న చిన్న చీటీలు యివ్వడం మొదలెట్టేరు)

**వ్యక్తి :** ఇదిగో అందరూ మా పార్టీకే ఓట్లు వెయ్యాలి. మన అన్న పెద్ద మెజారిటీతో గెలవాలి. ఇదిగో అచ్చం గాంధీ తీర్న వున్నవ్. అందుకే గాంధీతాత ఓటు నీకే యిస్తన్న! (వెళ్లిపోయారు)

**గాంధి :** (చేతిలోని చీటీని చదివి ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాడు)

**రాజా :** ఓటర్ల పేర్లు, నంబర్లున్న చీటీలు పంచుతారు. ఇవి తీసికెళ్తే - ఓటెయ్యడానికి బాలెట్ పేపర్ యిస్తారు.

**గాంధి :** నా పేరింకా ఓటర్ల లిస్టులో వుందా?

**రాజా :** మీదే కాదు. నెహ్రూది, శాస్త్రిది, నేతాజీది, పట్టాభిది, ప్రకాశం పంతులుది - మీ మీదున్న గౌరవంతో గతించిన నాయకుల పేర్లు అలాగే వుండి పోతుంటాయి. ఏ తల మాసినవాడో ఆ ఓటు వేసేస్తాడు. ఈ దేశంలో బ్రతికున్న వాడి మీద కన్న చచ్చిన వాడి మీద ప్రేమ, గౌరవం ఎక్కువ! పదండి బాపూ ఓటేసి వద్దాం. (గాంధీ ముందుకు నడిచాడు. రాజారాం అనుసరించాడు)

(లైట్స్ ఆఫ్)

## సీన్ నెం. 4

లైట్స్ ఆన్ అయ్యాయి - పోలింగు స్టేషన్ - గాంధీ, రాజారాం క్యూలో ఉన్నారు. (ఒక్కొక్కరు వచ్చి ఓట్లు వేస్తున్నారు. క్యూలో కల్లు సాంబయ్య సెల్ ఫోన్లో మాట్లాడుతూ వస్తున్నాడు)

**కల్లుసాంబ:** ఏంట్రా? వెయ్యి రూపాయిలిత్తానన్నాడా? వాడికే గుద్దేయ్!

**పో.ఆ:** కల్లు సాంబయ్య !

**కల్లుసాంబ:** తాటికల్లు సాంబయ్య !

(ఊగూగుతూ వెళ్ళి ఓటేసి వెళ్తున్నాడు)

**పో.ఏ :** బాబాయ్, ఓటేశావా!

**కల్లుసాంబ:** ఏసీసానరా! ...మీరేమో నాల్రోజులనుండి కల్లు, బిరియాని ఇస్తా వున్నారు. వాడేమో రాత్రి సెల్ ఫోను ఇచ్చాడు. తప్పు కదా మోసం చెయ్యకూడదు. అందుకని ఇద్దరికీ గుద్దేశానురా. (వెళ్లిపోతాడు – గాంధీగారు పోలింగ్ ఆఫీసరు దగ్గర కొచ్చాడు).

**పో.అ1:** (గాంధీ చేతిలోని స్లిప్ తీసుకొని), మహాత్మాగాంధీ! అని అరిచాడు (ఇంకో అసిస్టెంట్ గాంధీ వేలికి చుక్క పెట్టబోతున్నాడు.)

**పో.ఆ:** (లిష్టు చూసి ఖంగారుపడి) ఆగు! (అసిస్టెంట్ తిరిగి చూశేడు) ఆ ముసలాడ్ని పంపించెయ్!

**గాంధి :** ఎందుకు?

**పో.ఆ :** నీకు ఓటు లేదు.

**గాంధి :** ఉందనే యీ చీటీ యిచ్చారు.

**పో.ఆ :** ఓటుంది. కాని అయిపోయింది.

**గాంధి :** అయిపోవడమేవిఁటి?

**పో.ఆ :** అదే! ఓటు వెయ్యడం అయిపోయింది.

**గాంధి :** నేను వెయ్యందే యెలా అయిపోతుంది?

**పో. :** అదంతా నాకు తెలీదు. నీ ఓటు వేసేశారు.

**గాంధి :** అదే నేను అడుగుతున్నాను. నేను రాకుండా నా ఓటు యెవరు వేశారు?

**పో.ఆ :** ఏదో పగటివేషం వేసుకున్నంత మాత్రాన నిజంగానే గాంధీలాగ ఫీలవ్వకు పోఫో!

**గాంధి :** Stop this nonsense! నా ఓటు వేరే వాళ్ళు యెలా వేశారు? అంటే సమాధానం చెప్పకుండా, యేదేదో మాట్లాడతావేం?

**పో.ఆ :** చూడండి మాస్టారూ! ఓట్లు వేయించే బాధ్యత మాది. ఎవడి ఓటు యెవడు వేస్తున్నాడనేది చూసే బాధ్యత మాది కాదు.

**గాంధి :** ఆ బాధ్యత యింకెవరిది?

**పో.ఆ :** అదిగో, అక్కడ పొలిటికల్ పార్టీ యేజెంట్లున్నారు. ఓటర్లు అవునా – కాదా అన్నది గుర్తించే బాధ్యత వాళ్ళది. వాళ్ళు అబ్జెక్ట్ చెయ్యకపోతే, యెవడి ఓటు యెవడేసుకున్నా మాకే అబ్జెక్షన్ వుండదు. పోఫో !

**రాజా :** ఆయన యెవరనుకుని అలా మాట్లాడుతున్నావ్?

**పో.ఆ :** ఆఁ, మహాత్మాగాంధీ అనుకుని మాట్లాడుతున్నా! వెళ్ళెళ్ళు!

**రాజా :** (ఏదో అనబోయేడు)

**గాంధి :** నువ్వుండు రాజారాం! (ఏజెంట్లతో) ఏం బాబూ, మీరు పార్టీ ఏజెంట్లా?

**ఏజెంట్లు :** అవును.

**గాంధి :** నా ఓటు వేరే వ్యక్తి వేస్తే మీరు చూస్తూ వూరుకున్నారా?

**ఏజంట్1:** ఊరుకోక యేం చెయ్యమంటావ్?

**గాంధి :** దొంగ ఓట్లు వెయ్యకుండా అడ్డగించాలి.

**ఏజంట్2:** భలే చెప్పావ్ పెద్దాయనా! ఇదిగో యిక్కడ మూడు పార్టీలు పోటీ చేస్తున్నాయ్. మా రెండు పార్టీల కేండేట్లు ఒకే కులస్థులు. స్వయానా బావమరుదులు! ఇక మూడో పార్టీ కేండేటు మంచివాడే గాని, కులం-బలం లేదు. డబ్బు లేదు. స్థోమత లేదు. అంచేత, అతని యేజంట్లని లొంగిన చోట డబ్బులిచ్చి కొనేశాం. లొంగకపోతే, భయపెట్టో, నాలుగు తన్నో పోలింగ్ స్టేషన్లో అడుగుపెట్టకండా చేశాం. దొంగోట్లు మా యిద్దరి కేండేట్లు చెరి సగం పంచుకోడానికి ఒప్పందం కుదిరిపోయింది. అందుకే యెవడి ఓట్లు యెవడేసినా కిక్కురుమని నోరెత్తకండా కూచున్నాం. తెల్సిందా?

**గాంధి :** మిస్టర్ ఆఫీసర్! వాళ్ళు చెప్పిందంతా నిజవేఁనా?

**పో.ఆ :** అదీ...అదీ...

**గాంధి :** నీళ్ళు నవుఁల్తావేం? అదంతా నిజమయితే, ఎలక్షన్ కమిషన్‌కి రిపోర్ట్ రాయాల్సిన బాధ్యత నీ మీదుంది.

**పో.ఆ :** ఇదిగో పెద్దాయనా! ఈ గొడవంతా యెందుకు? నీకు కావల్సింది ఓటేగా? ఓయ్, ఓ బేలట్ పేపర్ చించి అతని చేతిలో పెట్టు. వెళ్ళి ఓటేసిరా పెద్దాయనా!

**గాంధి :** అదెవరి ఓటు?

**పో.ఆ :** ఎవరిదైతే నీకెందుకు? నీకు కావల్సింది ఓటు – వెళ్ళి వేసిరా!

**రాజా :** గాంధీగారు దొంగ ఓటు వెయ్యాలా?

**పో.ఆ :** ఏదో ఒక వోటు – వేసి వెళ్ళండి!

**ఏజంట్2:** ఇదిగో, నువ్వు దొంగోటు యెయ్యాలనుకుంటే – మా రెండు పార్టీల్లో యేదో ఒకదానికి వెయ్యాలి. మూడో పార్టీకి వేస్తామంటే మాత్రం కుదరదు. చెప్పు – మాకే కదా వేసేది?

**గాంధి :** ఓటనేది రహస్యంగా వెయ్యాలి. అది యెవరికీ చెప్పకూడదు.

**ఏజంట్1:** సరే చెప్పొద్దు – చూపించు!

**ఏజంట్2:** అవును. మేం చూస్తుండగానే గుద్దు.

**గాంధి :** ఓటు చూపించడం డెమొక్రసీకి విరుద్ధం!

**ఏజంట్2:** చూడు పెద్దాయనా, నీకు తెల్సింది కేవలం ఒక్క డెమోక్రసీ! మాకు తెల్సినవి చాలా వున్నాయ్!

**గాంధీ :** ఏంటవి?

**ఏజంట్1:** రిగ్గింగు, సైక్లింగు, బూత్ కేప్చరింగు, బాక్స్ స్నేచింగు, బేలట్ టియరింగు, వాటర్ పోరింగు, ఓపెన్ బేలట్...

**ఏజంట్2:** నెంబర్ వన్ – ఓపెన్ బేలట్! ఊరు మోతుబరి ముందు, బేలట్ పేపర్స్ వోపెన్‌గా పెట్టి, అతను చెప్పిన పార్టీకి గుద్దెయ్యాలి. దీన్ని ఓపెన్ బేలట్ అంటారు.

**ఏజంట్1:** ఆఫీసర్ల నుండి బేలట్ పేపర్స్ లాక్కుని దణ దణ దణ దణమని గుద్దేశామనుకో – దాన్ని రిగ్గుంగు అంటారు.

**ఏజంట్2:** ఒకవేళ ఆపీసర్లు స్ట్రిక్ట్ అయిపోయి రిగ్గింగ్ వొప్పుకోలేదనుకో. అప్పుడు యేం చేస్తామంటే – మనోళ్ళనే ఓ యాభై మందిని లైన్లో నిలబెట్టి – వాళ్ళే మళ్ళీ మళ్ళీ ఓట్లేసి వస్తుంటారు. దీన్ని సైక్లింగ్ అంటారు.

**ఏజంట్1:** ఒకవేళ యీ సైక్లింగ్‌ని ఆఫీసర్లు పసిగట్టారనుకో – మా మందీ మార్బలంతో పోలింగ్ బూత్‌ని స్వాధీనం చేసుకుని యిష్టమైనట్టు ఓట్లు గుద్దేసుకుని బాక్స్‌లో పడేసుకుంటాం. దీన్ని బూత్ కేప్చరింగ్ అంటాం !

**ఏజంట్2:** పైన చెప్పినట్లు అపోజిషన్ వాళ్ళు చేశారనుకో – మనం ఓడిపోతున్నాం అని పించిందనుకో – అప్పుడు కూడా కొన్ని సాధనాలు వున్నాయ్.

**ఏజంట్1:** అదేంటంటే – బేలట్ బాక్స్ తీసుకుని వెళ్ళిపోతాం!

**ఏజంట్2:** దీన్ని బాక్స్ స్నేచింగ్ అంటాం!

**ఏజంట్1:** బేలట్ పేపర్స్ చింపేస్తాం.

**ఏజంట్2:** పేపర్ టియరింగ్ అంటాం!

**ఏజంట్1:** బాలట్ బాక్స్‌లో నీళ్ళు పోసేస్తాం.

**గాంధీ :** వాటర్ పోరింగ్!

**ఏజంట్2:** విష్ణుమూర్తి యుగానికి ఒక అవతారమెత్తినట్లు – డెమోక్రసీ కూడా మా నాయకులు గెలవడానికి ఎన్నో అవతారాలెత్తింది. మా రెండు పార్టీల్లో ఏదో ఒకదానికి ఓటేస్తానంటే – పోయి ఓటేసిరా! లేదా చప్పుడు చెయ్యకుండా అవతలకి ఫోఁ! (ఇద్దరినీ బయటకు గెంటేశారు.)

**గాంధీ :** ఏవిఁటిది రాజారాం?

**రాజా :** ఇండియా టుడే!

**గాంధీ :** ఎన్నికల ప్రక్రియను భ్రష్టు పట్టించి, వక్రమార్గాన అసెంబ్లీకి, పార్లమెంటుకీ వెళ్ళే ప్రజాప్రతినిధులు ఎలాంటివారై వుంటారు?!

**రాజా :** సెషన్స్ జరుగుతున్నాయి. అసెంబ్లీకి ఒకసారి వెళ్ళి చూసి వద్దాం రండి!

(లైట్స్ ఆఫ్)

## సీన్ నెం. 5

(లైట్స్ వెలిగేసరికి అసెంబ్లీ కనిపించింది)

**స్పీకర్ :** కూర్చోండి...కూర్చోండి ! ఇపుడు క్వొశ్చిన్ నంబరు 1735 ఆనరబుల్ మినిష్టర్!

**మంత్రి :** (లేచి) అధ్యక్షా ! మొదటి ప్రశ్నకు సమాధానం లేదండీ. రెండవ ప్రశ్నకు సమాధానం రాదండీ. మూడవ ప్రశ్నకు సమాధానం ఉత్పన్నం కాదండీ.

**పే.పా.నా:** అధ్యక్షా! ఇదేమి జవాబు అధ్యక్షా!

**స్పీకర్ :** ఇంకేంటండీ. మంత్రిగారు చాలా ఇవరంగా చెప్పారుగా!

**పే.పా.నా:** ఏమి వివరం అధ్యక్షా! అసలు నేను అడిగిందేవిటంటే – మొదటి ప్రశ్న, అసలు ప్రభుత్వం ఉందా అడిగాను అధ్యక్షా! దానికి సమాధానం 'లేదండీ' అంటున్నాడు. రెండవ ప్రశ్న, ఈ ప్రభుత్వం నీతిగా, నిజాయితీగా పన్జేస్తుందా. అంటే సమాధానం రాదండీ అంటున్నాడు. ఇక మూడవ ప్రశ్న ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరస్తుందంటే, ఈ ప్రశ్నకు సమాధానం ఉత్పన్నమే కాదంటాడేవిటీ? ఇంతకన్న ఘోరం ఇంకెక్కడుంది అధ్యక్షా.

**స్పీకర్ :** ఏవిటండీ ఇది. ప్రతీ దాన్నీ ఇలా గంటల తరబడి మాట్లాడితే ఎలా! స్పీకర్ మీరా? నేనా!

**అందరూ:** మీరే ! మీరే!

**స్పీకర్ :** ఇంకేం ! One who speaks is the speaker. స్పీకర్ అని నాకు పేరు పెట్టి, మీరు మాట్లాడితే ఎట్లా! కూర్చోండి...కూర్చోండి.

**ప్ర.ప.నా:** అధ్యక్షా! ఒక్కోసారి నాకన్పిస్తా వుంది, మీరు యీ ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మా – లేకపోతే మీరు యీ దగాకోరు ప్రభుత్వానికి ఏజెంటా అని! (సభ్యుల గోల) ఎందుకంటే – మీరెప్పుడు చూసినా కూర్చోండి కూర్చోండి అంటున్నారు. గత ఎన్నికల్లో మాలో ముప్పాతిక మందిని ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారు. గెలిచిన వాళ్ళు అసెంబ్లీకి వస్తే యెప్పుడు చూసినా కూర్చోండి కూర్చోండి అంటున్నారు. దీనర్థం ఏవిఁటి అధ్యక్షా!

**అ.పా.నా:** అధ్యక్షా! ఒక గౌరవస్థానంలో ఉన్న మీరు, గౌరవంతో సభ్యుల్ని కూర్చోమన్నారు. అది కూడా, చాలా గౌరవంగా చెప్పారధ్యక్షా! మీరేమైనా 'కూర్చోరా' అన్నారా? లేదధ్యక్షా! పోనీ 'కూర్చోవే – అన్నారా? లేదధ్యక్షా! పోనీ

గౌరవ శాసన సభ్యుల్ని పడుకోమన్నా, పరిగెత్తమన్నా, దేకమన్నా, పాకమన్నా, గెంతమన్నా, కుంటమన్నా... అధ్యక్షా! బాధపడాలి అధ్యక్షా! అదేం లేకుండా కూర్చోమన్నందుకు, యెందుకంత బాధపడుతున్నారో, అర్థం కావటం లేదు. అధ్యక్షా!... అధ్యక్షా, మీకో విషయం మనవి చేయాలనుకున్నాను అధ్యక్షా! అధ్యక్షా, ఇపుడు మనింటికి ఎవరైనా వచ్చినపుడు రండి కూర్చోండి అంటామధ్యక్షా! పెళ్ళిలో కానీ, పుట్టుకలో గానీ, చావులోగానీ - యే సందర్భంలోనైనా, మనింటికి వచ్చిన వారిని కూర్చోండి! అని ఆహ్వానిస్తాం అధ్యక్షా! (స్పీకర్ 'కూచోండి, కూచోండి') అధ్యక్షా, ఒక్క నిమిషం అధ్యక్షా Only one minute అధ్యక్షా ! కూర్చోండి అంటే ఇంగ్లీషు డిక్షనరీలో, Please take your seat! please sit down! please have your seat! అని అర్థం వుంది అధ్యక్షా! అధ్యక్షా, అదే విధంగా, హిందీలో మనం ఒక్కసారి చూసినట్లయితే, అయియే! బైఠియే! ఆప్ బైఠియే! ఇధర్ బైఠియే!... ఇలా యెన్నో చెప్పుకోవచ్చు అధ్యక్షా! కాబట్టి తమరు గౌరవ శాసన సభ్యుల్ని, ఎంత మాత్రం తప్పుగా అనలేదు అధ్యక్షా! వాళ్ళెందుకు ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపిస్తూ, గోరంతల్ని కొండంతలు చేస్తున్నారో, ప్రతి దాన్నీ మసిబూసి మారేడుకాయ చెయ్యాలని, ఎందుకు అర్థంలేని ప్రచారం చేస్తున్నారో, నాకయితే అర్థం కావటం లేదధ్యక్షా! అధ్యక్షా, మీద్వారా గౌరవ శాసన సభ్యులకు ఒక్క విషయం మనవి చేస్తా వున్నానధ్యక్షా! సభ యొక్క సమయం, చాలా విలువయింది అధ్యక్షా! ఒక్కో గంటకి, కొన్ని లక్షల రూపాయల్ని ఖర్చు పెడుతున్నారధ్యక్షా! ఇదంతా ప్రజల డబ్బు అధ్యక్షా! సి.ఎం.గారు రాష్ట్రానికి అదనపు నిధులు తేవడం కోసం ఢిల్లీకి చర్చల కోసం వెళ్ళేరు. సభా సమాయాన్ని వృధా చెయ్యకండా, సమస్యలమీద చర్చించమనండి అధ్యక్షా! ప్రభుత్వం యెప్పుడూ సిద్ధంగా వుంది అధ్యక్షా! ఇప్పటికయినా ప్రతిపక్షం వాళ్ళు కళ్ళు తెరిచి-అధ్యక్షా, మీరే చూశారు. నేనెంతో కష్టపడి, ఇన్ని పుస్తకాలు చూపించి, మరి వాళ్ళు చేసిన అనవసర వ్యాఖ్యలకు, నేనెంతో వివరణ యిచ్చాను అధ్యక్షా - ఇంకా ఏమైనా మనసులో వుంటె, అడగమనండి అధ్యక్షా! మేము వివరణ ఇవ్వడానికి సిద్ధంగా వున్నాం, ప్రభుత్వం సిద్ధంగా వుంది. అంతేగాని, సభాసమయాన్ని వృధా చేస్తే మాత్రం, ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ప్రజలు కూడా క్షమించరని, మీ ద్వారా గౌరవ శాసన సభ్యులకి మనవి చేస్తూ, శలవు తీసుకుంటున్నాను అధ్యక్షా!

**ప్ర.ప.నా.:** అధ్యక్షా! ఈ దగాకోరు ప్రభుత్వం ప్రజల్నెంతో ఇబ్బంది పెడుతోంది అధ్యక్షా! రోజు రోజుకీ ప్రజల జీవితం చాలా కష్టమయిపోయింది. ధరలు ఆకాశానికంటుతున్నాయి. కరెంటు ఛార్జీలు, నీటి ఛార్జీలు, అన్ని ఛార్జీలూ పెరిగిపోతున్నాయి.

**యాద :** (ఎమ్మెల్యే 2తో) ఏదో ఒక గడబిడ చెయ్యకపోతే, వీళ్ళు యిట్లనే అరుస్తా వుంటారు. ఏం చేద్దాం?

**అ.పా.నా.:** ఆపద వచ్చినపుడల్లా మన పార్టీని దేవుడే కాపాడతాడు. చూద్దాం, యీసారి యేం జరుగుతుందో.

**యాద:** దేవుడిమీద భారం వేస్తే కుదరదు. వాళ్ళన్నట్టు కరెంటు ఛార్జీలు, నీటి ఛార్జీలు, బస్సు ఛార్జీలు పెంచేశాము. వాటితోపాటు లాఠీ ఛార్జీలు కూడా పెంచుదావేం?!

(అప్పుడే గాంధీ రాజారాంతో కలసి గ్యాలరీలోకి వచ్చేడు)

**అ.పా.నా:** కంగారు పడకు (అంటూ గ్యాలరీ వైపు చూసి) అటువైపు గ్యాలరీలోకి చూడు.

**యాద:** (చూశాడు)

**అ.పా.నా:** ఒకడు అచ్చం గాంధీలా వున్నాడు

**యాద:** అవును

**అ.పా.నా:** అతన్ని ప్రెస్సువాళ్ళకి చూపించి మహాత్మాగాంధీ బ్రతికి వచ్చాడని న్యూస్ అయిటమ్ వెయ్యండి. అతని ఫోటోని మెయిన్ పేజిలో వేయించండి. అసెంబ్లీ సెషన్స్‌లో వున్నంతకాలం యిదే న్యూస్ పేపర్లో రావాలి. ప్రజల concentration divert అయిపోతుంది. Go! Quick! (యాదగిరి ఎమ్మెల్యే 2కి రహస్యంగా చెవిలో చెప్పేడు ఎమ్మెల్యే 2 వేగంగా కదిలేడు)

**ప్ర.ప.నా:** అధ్యక్షా! ఈ ప్రభుత్వానికి పాలించే హక్కు లేదు అధ్యక్షా! ఈ ప్రభుత్వం వెంటనే గద్దెదిగాలి.

**యాద:** ఏందే కూస్తున్నావ్?

**ప్ర.ప.నా:** మాటలు మర్యాదగా రానీ!

**యాద:** నీకు మర్యాదా? నీ సంగతి ఎవరికి తెల్వదని? నువ్వెట్ల ఎమ్మెల్యే అయినవో చెప్పుమంటావా?

**ప్ర.ప.నా:** నేనూ చెప్పగలను.

**యాద:** తమరి చరిత్ర!

**ప్ర.ప.నా:** నేనూ చెప్పగలను నీ వంశచరిత్ర! వీధి వీధినా మైకుపెట్టి మరీ చెబుతాను. నీకు దమ్ముంటే బయటికి రారా చూసుకుందాం! (అని తొడగొట్టి సవాలు చేసింది)

**యాద:** బయటికెందుకు? ఈడనె తేల్చుకుందాం! (అంటూ వెళ్ళి పైట పట్టుకుని లాగాడు. జాకెట్టు చించేశాడు. (అలా అరుస్తుండగా ఒకరి మీదొకరు పడి కొట్టుకుంటూ గందరగోళంగా వుంది. పిడిగుద్దులతో అసెంబ్లీ దద్దరిల్లిపోయింది)

**ప్ర.ప.నా:** అధ్యక్షా! ఈ ఘోరం చూశారా? నా జాకెట్టు చించేశాడు. ఇదన్యాయం! అక్రమం! దౌర్జన్యం! వాడ్ని సస్పెండ్ చెయ్యండి.

**స్పీకర్ :** కూర్చోండి! కూర్చోండి!...

**ప్ర.ప.నా:** ఒక మహిళా ఎమ్మెల్యేకి శాసనసభలోనే రక్షణ లేకుండా పోయింది. ఛీ! ఇదేం గవర్నమెంట్? ఈ గవర్నమెంట్ అధికారంలో వుండగా, యీ అసెంబ్లీలో అడుగుపెట్టను! (యుద్ధభూమిని మరిపించే విధంగా అక్కడ పోరాటం జరుగుతుండగా – 'కూర్చోండి! ప్లీజ్ సిట్‌డౌన్! సైలెన్స్ ప్లీజ్' అనే స్పీకర్ కేకల్ని యెవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దాంతో స్పీకర్ "సభను రేపటికి వాయిదా వేస్తున్నాను" అని ప్రకటించారు)

(లైట్స్ ఆఫ్)

## సీన్ నెం. 6

(లైట్స్ వెలిగేయి. అధికార పార్టీ నాయకుడి యింట్లో సమావేశం. యాదగిరి, మరో ఎమ్మెల్యే తలకి, చేతులకి బ్యాండేజీలు కట్టుకుని వున్నారు.)

**అ.పా.నా:** ఏవంటున్నారు ప్రతిపక్షం వాళ్ళు?

**యాదగిరి:** ఏమంటరు, నిమ్స్‌లో జాయినయిన్రు! నెలరోజులు పడతదంట, సక్కంగ అవనీకి!

**అ.పా.నా:** ఏంటయ్యా, మరీ అంత రెచ్చిపోయి బాదేశావు!

**యాదగిరి:** లేకపోతే గట్ల మాట్లాడతాది?

**ఎమ్మెల్యే:** మనల్ని గురించి యేమనుకుంటున్నారు వాళ్లు? విమర్శంటే యెలా వుండాలి? శ్మశాన వైరాగ్యం, బాలింత బ్రహ్మచర్యం, రాజకీయ నాయకుల విమర్శ వొకేలా వుండాలి. అంతేగాని ఒళ్ళూ–పై మర్చిపోతే యెలాగ?

**అ.పా.నా:** నువ్వేమయినా చెయ్యి ఫరవాలేదు! ప్రెస్సువాళ్ళ కళ్ళల్లో మాత్రం పడకు – ఫ్రస్సయిపోతావ్!

**యాద :** నీ ఆశీస్సులున్నంతవరకు నన్నెవ్వడూ పీకలేడు. ఇగో సి.ఎం. గారికి చెప్పి, యీ సారయినా నన్ను కేబినెట్‌లో చేర్పియ్యరాదు?

**అ.పా.నా:** చూద్దాం!

**యాద :** పార్టీకోసం యెంత కష్టపడుతున్న? అసెంబ్లీ లోపలా బయటా – పార్టీని యెట్ల కాపాడుకొస్తున్న? నాకు మినిష్ట్రీ యియ్యకుంటె యెట్లన్నా?

**అ.పా.నా:** నా మీద యెగిర్తే నేనేం చేస్తానయ్యా? వెళ్ళి సి.ఎం.ని అడుగు. ఇవ్వకపోతే యెదురు తిరుగు!

**యాద :** ఏందీ? సి.ఎం.కి యెదురు తిరగాలె – వారెవ్వ యేం చెప్పినవన్నా...అట్ల చేస్తె యింకేమన్న వుంటదా?

(అప్పుడే బయట నుండి ఎమ్మెల్యే – 2 వచ్చాడు. అతని చేతిలో కొన్ని న్యూస్ పేపర్లున్నాయి)

**ఎమ్మెల్యే2:** అయ్యా ప్రెసిడెంటుగారూ! గాంధీ గురించి మీరు చెప్పిన వార్త ఎలా వచ్చిందో చూశారా?

**అ.పా.నా:** ఛ నోర్ముయ్ ! నేను చెప్పడమేవిఁటి?...సరిగ్గా మాట్లాడు.

**ఎమ్మెల్యే2:** (అర్థం చేసికొని) అఁ... ఆఁ... అదే! గాంధీ గురించి వార్త యెలా వచ్చిందో చూశారా అంటున్నాను. (ఒక పేపరు చూపిస్తూ) చూడండి 'గాంధీ బ్రతికొచ్చాడా?' (మిగతావాళ్ళు తలొక పేపరు తీసుకుని వాటిలోని హెడ్‌లైన్స్ చదివేరు)

**ఎమ్మెల్యే3:** 'మహాత్ముడు మళ్ళీ వచ్చాడా?

**ఎమ్మెల్యే1:** 'గాంధీ వర్సెస్ గాంధీ!'

**ఎమ్మెల్యే2:** 'ఇంతకుముందు నేతాజీ యింకా బ్రతికే వున్నాడనీ, జర్మనీ మిలటరీ కేంప్‌లో యెవరికో కనిపించాడనీ – ఇలా రకరకాల వార్తలు – కథలూ వినిపించాయి. అలాగే, యిప్పుడు బాపూజీ విషయంలో ఒక క్రొత్త కథనం వినిపిస్తోంది. అచ్చంగా గాంధీలానే వున్న వ్యక్తి, గత నాలుగయిదు రోజులుగా నగరంలో

కనిపిస్తున్నాడనీ, అతను తాను నిజంగానే మహాత్మాగాంధీనని చెబుతున్నట్టు కథనాలు వెలువడ్డాయి. అయితే యీ వ్యక్తి యెవరో యేమిటో, యెక్కడి నుండి వచ్చాడో అనే విషయంపై వార్తా పత్రికలు, పోలీసులు అచూకీ తీస్తూ ఉన్నట్లు తెలుస్తోంది'.

**అ.పా.నా:** ఇదిగో ఆపవయ్యా ఆ సోది! తెల్లవారితే పేపరు చదవందే నాకు ఇది రాదు. అంతా చదివాను. నువ్వింకేమీ వినిపించక్కర్లే ఆపు!

**యాద :** గది సరే అన్నా గీ వార్త సూడు! పేపరుచదివి గాంధీవార్ని సూడనీకి, జనం జాతరకు వచ్చినట్టు వస్తున్నరంట!

**అ.పా.నా:** నిజమా?

**యాద :** మల్ల అదేగద న్యూసు! నమ్మకపోతే పోలీస్ కమిషనర్ని అడగరాదు?

**అ.పా.నా:** కలుపు! (యాదగిరి ఆనందంగా చెయ్యి కలిపేడు. అది చూసి) చెయ్యి కాదు! ఫోను!

**యాద :** (ఫోన్ డయల్ చేసి) ఆఁ... పోలీస్ కమిషనర్ ఆఫీసేనా? నేను-ఎమ్మెల్యే యాదగిర్ని మాట్లాడుతున్న. రూలింగ్ పార్టీ ప్రెసిడెంట్ సారు మాటాడతరంట. కమిషనర్‌కి యియ్యి!... నమస్తె సారూ! నేను యాదగిర్ని! ఇగొ అన్నతోని మాటాడుండ్రి. (అంటూ రిసీవర్ తుడిచి అ.పా.నా.కి యిచ్చేడు)

**అ.పా.నా:** ఆఁ నేనే మాట్లాడుతున్నాను. నమస్తే!... ఏంటది గాంధీ?... ఆఁ! ఆఁ.. ఆఁ ఆఁ ఓకే! లా అండ్ ఆర్డరు జాగ్రత్తగా చూసుకోండి. గట్టి బందోబస్తు పెట్టండి... ఆఁ!... ఆఁ? ఆయనకే అపకారం జరక్కూడదు!.. ఓకే ఓకే! మీ మీద మాకు నమ్మకముంది. కేరీఆన్ కేరీఆన్!... ఏంటి? ఏంటి? ఏంటీ? (పక పకమని నవ్వాడు. నవ్వాపుకోలేక నవ్వుతున్నాడు) గుజరాత్ భూకంపం చూడ్డానికి మళ్ళీ భూమ్మీదకు వచ్చాడని ప్రజలనుకుంటున్నారా? (మళ్ళీ నవ్వు) అనుకోనీ... నువ్వు కో-ఆపరేట్ చేస్తే ఓ చిన్న పన్జెప్తాను. చెప్పమంటావా? ఏం లేదు, మా ఎమ్మెల్యే యాదగిరి నీకు తెల్సు కదా? పాపం, పార్టీకోసం యెంతో సేవ చేశాడు. కానీ యేం సంపాదించుకోలేదు. ఓ మంత్రి పదవి చెయ్యలేదు. ఓ ఛైర్మన్‌గిరీ వెలగబెట్టలేదు. అందుకే గాంధీ వున్న యింటి ముందు ఓ హుండీ పెట్టుకుంటాడు!... ఎందుకా, ఎందుకేంటండీ.. గాంధీ వెయ్యమన్నాడని, భూకంప నిధి ఆ హుండీలో వేయించుకుంటాడు. ఓ యాభై లక్షలు సంపాదించుకుంటే, వచ్చే ఎలక్షన్లకి పనికొస్తాయి. ఏవంటారు?... అతనా? అతన్నుంచి యేం లేకుండా నేన్జూసుకుంటాను. ఓకే?... థాంక్యూ!

బందోబస్తు జాగ్రత్త! (రిసీవరందిస్తూ) యాదగిరీ నీ పంట పండిందిలే ఫో! ఆ గాంధీ యింటి ముందు హుండీ పెట్టుకో! డొనేషన్లు దండుకో!

**యాద :** ఏంటన్నా, గాంధీయే డూప్లికేటు గాంధీ! అసుంటోడు చెబితే డొనేషన్లు యెవడిస్తడన్నా!

**అ.పా.నా:** ఓరి పిచ్చోడా, వరదలు ఆగిపోవాలని గొఱ్ఱెల్నీ మేకల్నీ తెగనరికే దేశం మనది! నిధులూ నిక్షేపాలూ దొరకాలని పసిపిల్లల్ని బలిచ్చే భూమిరా మనది! అంతెందుకు, గణపతి బొమ్మలు పాలు తాగుతున్నాయని వేలం వెర్రిగా, పాలగ్లాసులు పట్టుకుని వెళ్ళి విగ్రహాలకి పాలు పట్టిన పుణ్యభూమి మనది! అలాంటిది, గుజరాత్ భూకంపం చూడ్డానికి గాంధీ బ్రతికొచ్చాడని నమ్మిన ప్రజలు–ఆ గాంధీ విరాళాలు యిమ్మన్నాడంటే యివ్వరా? ఇస్తారు! లక్షలకు లక్షలు యిస్తారు. పో! పోయి నీ యేర్పాట్లు నువ్వు చేసుకో! నువ్వు ఆలస్యం చేస్తే వేరే యెవరైనా ఆ అవకాశం తన్నుకుపోతారు. వెళ్ళు!

**యాద :** సరె అన్నా! ప్రజలిస్తరు! కాని హుండీ పెట్టుకోనీకి ఆ ముసలోడు వొప్పుకోవద్దా?

**అ.పా.నా:** తప్పక వొప్పుకుంటాడు. పైగా ఆనందిస్తాడు! డబ్బున్న ధనవంతులు – ఆపదల్లోనూ, అవసరాల్లోనూ ముందుకొచ్చి పేదవారిని ఆదుకోవాలన్నదే గాంధీగారి నినాదం. కాకపోతే మనలాంటి వాళ్ళం మధ్యలో దొరికింది బొక్కేస్తాం – అది అతనికి సరిపడదు.

**యాద :** ఏందన్నా యీ ఫిటింగు? ఓ దిక్కు హుండీ పెట్టుకోమంటవు. మరో దిక్కు అతనికి సరిపడదంటవు! ఎట్లన్నా సచ్చేడిది?

**అ.పా.నా:** ఛీ – యేం పుట్టక పుట్టావయ్యా? రాజకీయ నాయకుడి పుట్టక కాదా? అరె పగటిపూట అతనికి నమ్మకంగా వుంటావు! ఏ రాత్రిపూటో మారు తాళాలు పెట్టి మూడొంతులు నొక్కేస్తావు! మిగతాది లెక్క అప్ప చెప్పేస్తావు – ఇది కూడా నేనే చెప్పాలా? ఆఁ? ఒద్దులే – యిది నీవల్ల అయ్యే పని కాదు. మరెవరికైనా –

**యాద :** ఒద్దన్నా వొద్దు. నాకు అర్థమైపోయింది. ఇక నన్ను దీవించు (అంటూ కాళ్ళు మొక్కి వెళ్ళిపోయాడు)

**అ.పా.నా:** (మిగిలిన వారిని చూస్తూ) సెషన్స్ జరుగుతున్నంత కాలం, యీ గాంధీన్యూస్ హెడ్‌లైన్స్‌లో రావాలి. అప్పుడు ప్రజలు మనం పెంచిన రేట్ల గురించి గాని,

వాళ్ళు పడుతున్న పాట్ల గురించి గాని యేమీ ఆలోచించరు. పరిపాలన కూడా వొక మేజిక్ లాంటిదే! ప్రజల బ్రతుకులు మార్చగల శక్తి లేనపుడు, వాళ్ళను యేమార్చగల యుక్తయినా వుండాలి. ఆ యుక్తి యెవడికుంటుందో వాడి చేతిలోనే పగ్గాలుంటాయి.

(లైట్స్ ఆఫ్)

## సీన్ నెం. 7

(గాంధీ, రాజారాం ఇంట్లో వున్నారు. బయట జనం అరుపులు, కేకలు – గందరగోళంగా వుంది. గాంధీ చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. యాదగిరి గాంధీతో యేదో చెప్పబోయేడు. గాంధీ వినిపించుకోలేదు. యాదగిరి రాజారాంకి తాను వుంచిన హుండీని చూపించి, దాని తాళం చేతులు అందించి నమస్కారం చేసి బైటికి వెళ్ళేడు. బైట గోల యెక్కువగా వినబడుతూంది. 'గాంధీగారు బయటకు రావాలి. మహాత్మా మిమ్మల్ని చూడాలి' అని అరుస్తున్నారు)

**రాజా :** (గాంధీజీతో) బాపూజీ! ఏవింటి ఆలోచిస్తున్నారు? బయటికొచ్చి ప్రజలకు కనిపించండి. మిమ్మల్ని చూడాలని వాళ్ళు తహతహలాడుతున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే పరిస్థితి చేయి జారిపోతుంది. ఈ గోడల్ని బద్దలు కొట్టుకునైనా లోపలికొచ్చేట్టున్నారు. బాపూజీ! ప్లీజ్! ఒక్కసారి ప్రజలకు కనపడండి.

**గాంధీ :** రాజారాం! నన్ను కూడా వాళ్ళ బలహీనతలతో ఆడుకోమంటావా?

**రాజా :** నా ఉద్దేశ్యం అది కాదు. ఇదంతా చర్చించే సమయం కాదిది. ఈ వార్తలు చూడండి. వీటిని చదివిన తరువాత ఎవరిలో మాత్రం ఉత్సాహం, ఉత్సుకత పెరగదు? అందుకే వేల మంది మీ దర్శనం కోసం వచ్చారు.

**గాంధీ :** No... don't use the word! దర్శనమేవిటి – దర్శనం? నేనేమైనా దేవుణ్ణా? నేనెవర్నీ కలవను. అందర్నీ పంపించెయ్యండి. ఎవరు చేయించారీ పని? ప్రతీదీ సెన్సేషనలైజ్ చేస్తారా? ప్రజల్నింకా బుద్ధిహీనుల్ని చేస్తారా? నో! పంపించెయ్యండి.

**రాజా :** బాపూజీ! జన సందోహం తేనె తుట్టె లాంటిది. ఒక రాయి వేసి దాన్ని యెవరైనా కదపొచ్చు. మామూలు స్థితికి మాత్రం దానంతటదే రావాలి. మీరొక్కసారి కనపడితే ప్రజలు సంతోషిస్తారు. పరిస్థితి మామూలుకొస్తుంది. (గాంధీ కాదని తల అడ్డంగా ఊపి వెళ్ళి చరఖా దగ్గర కూర్చుంటాడు. రాజారాం చేసేది లేక తలుపు తీసి)

**రాజా :** ప్రజలారా నిశ్శబ్దం. దయచేసి నిశ్శబ్దంగా ఉండండి. (గాంధీజి బయటకు రావాలని జనం కేకలు) గాంధీజి వస్తారు...మిమ్మల్ని చూస్తారు. గాంధీజికి క్రమశిక్షణ అంటే చాలా ఇష్టం. మీరంతా నిశ్శబ్దంగా, క్రమశిక్షణతో కూర్చుంటే, గాంధీజి తప్పక వస్తారు. (క్రమంగా నిశ్శబ్దమయింది – ఇది గాంధీజి గమనిస్తారు. ఆశగా రాజారాం గాంధీజీవైపు చూస్తాడు. గాంధీజీ మొహం తిప్పుకున్నాడు. ఇంతలో బయటనుండి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఒక కంఠం “రఘుపతి రాఘవ రాజారాం పతీత పావన సీతారాం” అని పాడింది. జనమంతా గొంతు కలిపారు – పాడుతున్నారు. గాంధీజీ కరిగిపోయారు. గాంధీజీ పైపంచ భుజమ్మీద వేసుకొని లేచి నిలబడ్డాడు. రాజారాం చేతి కర్ర అందించాడు. ఇద్దరూ బయటకు వచ్చారు. గాంధీని చూస్తూనే ప్రజలు ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. ‘మహాత్మాగాంధీ జిందాబాద్’ ‘మహాత్మాగాంధీ వర్ధిల్లాలి’ అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోయింది. కొద్దిసేపటి తర్వాత మెడనిండా దండలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయిన గాంధీ లోపలికి వచ్చారు. అతనితోపాటు రాజారాం, అధికార పార్టీ నాయకుడు, యాదగిరి, మరి కొంతమంది కార్యకర్తలు లోపలకు వచ్చారు. గాంధీని నిదానంగా సోఫాలో కూర్చోబెట్టారు.

**అ.పా.నా:** ఆఁ ఆఁ! జాగ్రత్త..జాగ్రత్త! నిదానంగా కూర్చోండి. ఆ దండలు తీసెయ్యండి. గాలి ఆడుతుంది... ఆఁ.. ఆఁ (కండువాతో విసురుతున్నాడు)

**గాంధీ :** మీరూ...

**అ.పా.నా:** నేను అధికార పార్టీ అధ్యక్షుడ్ని.

**యాదగిరి:** మీకింత పాపులారిటీ రానీకి అన్నే –

**అ.పా.నా:** యాదగిరీ! (యాదగిరి ఆగిపోయేడు) ప్రజలు మిమ్మల్ని నిజంగానే గాంధీ అనుకుంటున్నారు.

**రాజా :** అనుకోవడమేవిఁటి? ఆయన నిజంగానే–

**గాంధీ :** రాజారాం!

**రాజా :** సరి సరి (అ.పా.నా.తో) మీరే మాట్లాడండి!

**అ.పా.నా:** కాబట్టి మీరు మాతో సహకరించాలి.

**గాంధి :** ఏ విషయంలో?

**అ.పా.నా:** ఇదీ అదీ ఏవుంది? మా పార్టీని మీరు ఆశీర్వదించండి. మమ్మల్ని మీ బిడ్డలుగా స్వీకరించండి. కాదూ కూడదూ అంటే – ఏకంగా మీరు మా పార్టీలో చేరండి! మరో సంవత్సరంలో ఎలక్షన్స్ రాబోతున్నాయి. అపుడు మీరుగానీ మా తరఫున ప్రచారం చేస్తే రెండు వందల యాభై సీట్లకు తగ్గితే

మీ చెప్పుతో కొట్టండి నన్ను! (అప్పుడే రామరాజ్యం పార్టీ నాయకుడు 'రఘుపతి రాఘవ రాజారాం, పతితపావన సీతారాం! ఈశ్వర్ అల్లా తేరోనామ్, సబ్‌కో సన్మతి దే భగవాన్' అంటూ పాడుకుంటూ వచ్చేడు)

**రా.పా.నా:** అయ్యా నమస్కారం! గాంధీగారూ నమస్కారం!

**గాంధి :** మీరు..?

**రా.పా.నా:** నేను రామరాజ్యం పార్టీ అధ్యక్షుడ్ని! మీరు చెప్పిన రామరాజ్య స్థాపన కోసం, కంటిమీద కునుకు లేకుండా కృషి చేస్తున్నవాడిని. ఇదిగో యివి తీసుకోండి ముందు.

**రాజా :** ఏవిఁటండీ అది?

**రా.పా.నా:** ఏముంటాయండీ! పిడికెడు వేరుశనగ పప్పు –గ్లాసుడు మేకపాలు! తీసుకోండి గాంధీగారూ! (అప్పుడే పేదల పార్టీ నాయకుడు రాబోయేడు. అతడిని చూసి)

**రాజా :** అయనిప్పుడు యెవరినీ కలవరు. మీరు తర్వాత రండి.

**పే.పా.నా:** అయ్యా నేను పేదల పార్టీ అధ్యక్షుడ్ని (అంటూ నమస్కారం చేశేడు) (వెనువెంటనే ప్రతిపక్ష పార్టీ నాయకురాలు సరాసరి వచ్చి గాంధీగారి కాళ్ళమీద పడిపోయింది. ఆమె నుదుటిమీద ప్లాస్టర్లు అతికించి వున్నాయి)

**గాంధీ :** మీరెవరమ్మా?

**ప్ర.పా.నా:** నేను బాపూజీ, ప్రతిపక్ష పార్టీ అధ్యక్షురాల్ని. నన్ను ఆశీర్వదించండి.

**రాజా :** మొన్న అసెంబ్లీలో గొడవ జరిగిన అమ్మాయి!

**ప్ర.ప.నా:** బాపూజీ చూశారా! అసెంబ్లీలోనే స్త్రీకి రక్షణ లేదు. ఆడది అర్ధరాత్రి ఒంటరిగా నిర్భయంగా వెళ్ళినప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టని అన్నారు మీరు.

**గాంధీ :** నా వుద్దేశ్యం, పై వాళ్ళ వలన భయంలేకుండా క్షేమంగా వెళ్ళడవఁని! అంతేగాని, భయాన్ని వదిలి, బరి తెగించి తిరగడవఁని కాదు.

**ప్ర.ప.నా:** పోన్లెండి! ఇప్పుడైనా మమ్మల్ని చూసి గర్వపడుతున్నారు.

**గాంధీ :** ఓ చాలా!

**ప్ర.ప.నా:** బాపూజీ! నన్ను పరాభవించిన ఈ ప్రభుత్వం పడిపోయేంతవరకు నిద్రపోను. వీళ్ళను గద్దెదించడమే నా ఆశయం! నన్ను ఆశీర్వదించండి! నాకు జరిగిన అన్యాయానికి మీరు సత్యాగ్రహం చెయ్యండి. మీకూ నాకూ మంచి పబ్లిసిటీ వస్తుంది.

**రా.పా.నా:** చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకున్నారు గాని, అతని పాలసీల్నిగాని, పద్ధతుల్నిగాని యెప్పుడైనా గౌరవించారా? ఈ దేశం అతను రామరాజ్యంగా మార్చాలనుకుంటే – దాన్ని మీరు రావణకాష్ఠంగా మార్చారు.

**పే.పా.నా:** ఇదిగో యీ మతమౌఢ్యాన్నే మొదటి నుంచి మేము ఖండిస్తున్నాం. మాకు కావాల్సింది రామరాజ్యం – భీమరాజ్యం కాదు. కార్మిక, శ్రామిక, కర్షక, శ్రేయోరాజ్యం!

**అ.పా.నా:** నువ్వు నోర్ముయ్! మీ దారి నెత్తుటి దారి. దయ్యాలు దేవాలయానికి వచ్చినట్టు, నువ్వు గాంధీ దగ్గరకొచ్చావ్ –

**పే.పా.నా:** మిత్రమా! ఆనాడైనా, ఈనాడైనా, యేనాడైనా – యీ దేశంలో అసలు సిసలైన కార్మిక, శ్రామిక ప్రతినిధి గాంధీ ఒక్కరే! ఆయన వేసుకున్న దుస్తులు – బీదరికానికి చిహ్నం! ఆయన తినే తిండి – యీ దేశ దౌర్భాగ్యానికి గుర్తు! అతని చేతిలోని కర్ర – ప్రజల్ని సాయుధ పోరాటానికి ఉసికొల్పే మారణాయుధం! ఇంతకన్నా విప్లవకారుడు యెక్కడున్నాడు. చూపించండి!

**రాజా :** అయ్యా! అందరికీ నమస్కారం! మీరొచ్చిన పనేవింటో శలవిస్తే బాగుంటుంది.

**అ.పా.నా:** ఇదిగో పెద్దాయనా! నువ్వు అసలో–నకిలీయో మాకనవసరం. కానీ ట్రెండ్ చూస్తే – ప్రజలు నిన్ను అసలు – గాంధీగానే నమ్ముతున్నారు. నువ్వేం చెయ్యమంటే అది చేసేటట్టున్నారు. నువ్వు యే గంగలో దూకమంటే ఆ గంగలో దూకేటట్టున్నారు. కాబట్టి, నువ్వు మా పార్టీకి మద్దతిస్తే – నీకు జూబ్లీహిల్స్‌లో మంచి బంగళా, కారు, ఫోను యిస్తాం! సంవత్సరానికి ఓ నాలుగు ఫారిన్ ట్రిప్పులు యేర్పాటు చేస్తాం. పైగా మంచి ప్రాఫిట్స్‌లో నడుస్తున్న ఓ కార్పొరేషన్ని నష్టాల్లో చూపించేసి, మీ బంధువుల పేర్న ప్రయివేటైజ్ చేసేస్తాం. ఏవంటారు?

**ప్ర.ప.నా:** బాపూజీ! వారి మాటలు నమ్మొద్దు. వచ్చే ఎలక్షన్లలో మమ్మల్ని గెలిపిస్తే – మిమ్మల్ని యేదో రాష్ట్రానికి గవర్నరుగా వేసేస్తాం. గుర్తుంచుకోండి, మాది జాతీయపార్టీ!

**రా.ప.నా:** మాకు మద్దతిస్తే – వీటన్నిటితో బాటు, మీచేత కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు రథయాత్ర చేయిస్తాం.

**పే.పా.నా:** మిత్రమా! వర్గ పోరాటమే మా ఆశయం! ఆ ఆశయాన్ని నువ్వు ఆశీర్వదిస్తే, తూర్పున వెలుగు రేఖలు విచ్చుకుంటాయి. ఆ వెలుగులో స్మృతి చిహ్నాన్ని నిర్మించి, ప్రపంచానికి మీ త్యాగాన్ని చాటుతాం! మీ బూర్జువా భావాల్ని పటాపంచలు చేసుకుని మా వైపు రండి!

**గాంధీ :** Stop...Stop the hell ఏవింటీ పదవిలోకి రావటానికి యేవైనా చేస్తారా!

**అ.పా.నా:** ఏం చెయ్యకూడదా?

**రా.పా.నా:** పదవి లేకుండా ఎవడూ, ఏమీ సాధించలేడు. అలాంటప్పుడు ఆ పదవి ఎలాగోలా సాధించడంలో తప్పేముంది?

**గాంధీ :** రాజారాం!

**రాజా :** సార్ !

**గాంధీ :** నా రాకలోని ఆంతర్యమేమిటో మీరు చెప్పండి.

**అ.పా.నా:** (మిగతావాళ్ళతో) కరెక్టే! మనం కూడా మనకేం కావాలో – మన పీయేలతోనే చెప్పిస్తాం! (రాజారాంతో) చెప్పండి చెప్పండి!

**రాజా :** దేశ పరిస్థితుల్ని సరిదిద్దుకోవాలంటున్నారు బాపూజీ!

**పే.పా.నా:** కరెక్ట్! వర్గ పోరాట మొక్కటే అందుకు సాధనం!

**గాంధీ :** ఎందుకయ్యా హింస జోలికి పోతావు? నీ వాదాన్ని నేనెప్పటికీ సమర్థించను. రక్తంపోసి ఎర్రగులాబీల్ని పూయించాలని ప్రయత్నించకండి.

**పే.పా.నా:** సమసమాజం రావాలంటే తప్పదు.

**గాంధీ :** సమసమాజ స్థాపన ఓ ఉన్నతమయిన ఆశయం. ఆ ఉత్తమమైన ఆశయాన్ని ఇంకా ఉన్నతమయిన మార్గంలోనే చేరుకోవాలి. హింస ద్వారా కాదు. (పే.పా.నా ఏదో చెప్పబోయేడు) ఇంక మీరు మాటాడొద్దు. నీ వాదం అమలు చేసిన దేశాలు యేమయ్యాయి? కుప్పకూలిపోయాయి. మనిషయినా – దేశమయినా ఎదగడానికి స్వేచ్ఛ కావాలి, స్వేచ్ఛ! పౌరులకు స్వేచ్ఛనివ్వకుండా ఏ ప్రభుత్వమూ స్వేచ్ఛను అనుభవించలేదు. పౌరుడంటే యెవరో తెలుసా? శ్వాసించే ప్రభుత్వం! అతనికన్నా – నీ శాసించే ప్రభుత్వం గొప్ప కాదు. ఫో – యిక్కడ్నించి ! (పేదల పార్టీ నాయకుడు వెళ్ళిపోయాడు)

**రా.పా.నా:** బాగా బుద్ధి చెప్పారు దుండగులకి! అందుకే మీరు చెప్పిన రామరాజ్యం కోసం మేం కృషి చేస్తున్నాం!

**గాంధీ :** Shut up! tell me! What is meant by Rama Rajya? Tell me What did I mean by Rama Rajya? Tell me...

**రా.పా.నా:** అదే...అయోధ్యలో–

**గాంధీ :** రామరాజ్యం నేను కలలు కన్న ఆదర్శ రాజ్యం! It is a new social order, where villages are autonomous! Self-sufficient! And protect their own independent life! You know - యీ గ్రామాలు - these villages will be united by what? మీమీ చవకబారు పథకాల వల్లకాదు. By a bond of spiritual unity and social co-operation! నేనూహించిన గ్రామ స్వరాజ్యంలో No force! No command! No compulsion! You know? గ్రామం మన భారతీయ జీవన సౌందర్యం! గ్రామం మన ఆధ్యాత్మిక చింతనా సాలిగ్రామం! గ్రామం మన ప్రగతికి ముఖ్యకేంద్రం! అలాంటి గ్రామాల్ని –

**అ.పా.నా:** అందుకే గ్రామాలకు యింటర్నెట్టు, యి మెయిల్ సిస్టమ్ ప్రవేశపెట్టి, డెవలప్ చేయాలని చూస్తున్నాం!

**గాంధీ :** Don't irritate me! ముందుగా గ్రామాల్ని బ్రతికించండి – లేకపోతే మీరు చేస్తున్న డెవలప్‌మెంట్ అంతా, శవానికి చేస్తున్న అలంకరణ అవుతుంది. Please go away! (అధికార పార్టీ నాయకుడు, రామరాజ్య పార్టీ నాయకుడు వెళ్ళిపోయారు)

**ప్ర.ప.నా:** థేంక్యూ బాపూజీ! మమ్మల్ని మీ అసలైన వారసులుగా గుర్తించారు. అది చాలు. మమ్మల్ని ఆశీర్వదించండి. (అంటూ మళ్ళీ కాళ్ళమీద పడింది)

**గాంధీ :** (కర్రపైకెత్తి) ఆడదానివి అయినందుకు వదిలిపెడుతున్నాను. ఈనాటి దౌర్భాగ్యానికి మీ వక్రబుద్ధే కారణం. ఫో అవతలికి! (ప్రతిపక్ష పార్టీ నాయకురాలు మూతి మూడు వంకర్లు తిప్పి వెళ్ళిపోయింది)

**రాజా :** చూశారా బాపూజీ, యీ రాజకీయ పార్టీల్ని, వాటి తీరుతెన్నుల్ని!

**గాంధీ :** పదవుల్లో వున్నవారు వీరికి భిన్నంగా లేరా?

**రాజా :** ఎలా వుంటారు? గంజాయి వనంలో తులసి మొక్కలా ఒకరో యిద్దరో వున్నా, వాళ్ళవల్ల యేమవుతుంది? మహాత్మా! ఏదో వొకటి చేసి రాజకీయ రంగాన్ని ప్రక్షాళనం చెయ్యాలి. ప్రజలీ పాపభారాన్ని యింకా యెంత కాలం మోస్తారు? అమృతభాండం రాక్షసుల వశం కాకుండా కాపాడడానికి మహావిష్ణువు మోహినిగా అవతరించాడు. నువ్వు సంపాదించిన ప్రజాస్వామ్యమనే అమృత భాండాన్ని, స్వార్థపరులైన రాక్షస నాయక మూకలు తన్నుకుపోతుంటే చూస్తూ వూరుకోవడం భావ్యమా? ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని నీకు అనిపించడం లేదా? ప్రజలని వీళ్ళ బారి నుండి రక్షించరా! అందుకు మరో ఉద్యమాన్ని నడపరూ! (అంటూ చేతులు జోడించేడు)

**గాంధీ :** తప్పకుండా! దోపిడీ జరుగుతున్నప్పుడు – అది చేసేది పరాయివాడైనా మన వాడైనా నా స్పందన వొక్కటే! అది ఉద్యమం! ఏ ఉద్యమానికైనా వూపిరి ప్రజలే! వారిని చైతన్యపరిచేందుకు దేశాటన చెయ్యాలి. ముందుగా మనవొంక పని చెయ్యాలి.

**రాజా :** ఏవిటది మహాత్మా?

**గాంధీ :** అన్ని పార్టీల్లోనూ, ప్రభుత్వాల్లోనూ వున్నవారికి ఒక అల్టిమేటమ్ యివ్వాలి.

**రాజా :** ఏమని బాపూజీ?

**గాంధీ :** చెబుతాను. ప్రెస్సువాళ్ళని పిలిపించండి.

**రాజా :** అలాగే! (అని ఫోన్ డయల్ చేస్తున్నాడు)

(లైట్స్ ఆఫ్)

## సీన్ నెం. 8
## Montages

### 1. వీధి :

(గాంధీ, రాజారాం నడుస్తున్నారు. వెనక వస్తున్న వ్యక్తులతో గాంధీ చెబుతున్నాడు)

**గాంధీ :** ప్రజాస్వామ్యాన్నీ స్వేచ్ఛనీ భ్రష్టుపట్టించారు. రాజకీయ నాయకుల అనైతిక ధోరణులకు అడ్డుకట్ట వెయ్యాలి. లేకపోతే ప్రజా జీవితం యింకా దుర్భరమైపోతుంది. ఏ ప్రజలైతే మీకు పట్టం కట్టేరో, ఆ ప్రజలే మీకు గోరీ కట్టగలరని గుర్తుంచుకోండి. ఇదే ఆఖరి హెచ్చరిక! నేను ముఖ్యంగా చెప్పేదేవిఁటంటే–రిగ్గింగులు చేసి దొంగ వోట్లు వేయించుకుని గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చెయ్యాలి. నేర చరిత్ర వున్న వాళ్ళు – అంటే – గుండాలు, రౌడీలు, సారాయి – జూదం – మట్కా మొదలైన వ్యాపారాలతో సంబంధం వున్న వాళ్ళు రాజకీయ రంగం నుండి తప్పుకోవాలి. (లైట్స్ ఆఫయి, వేరొక చోట స్పాట్ వెలిగింది. ఆ వెలుగులో పేదల పార్టీ నాయకుడు కనిపించేడు)

### II. Spot light లో

**పే.పా.నా:** తప్పుకుంటే దేశం యేమైపోతుంది? అసలు గూండాలు, రౌడీలు రాజకీయాల్లోకి యెప్పుడొచ్చేరో తెలుసా యీయనకి? ఎన్నికల్లో గెలవడానికి కండబలం కావాల్సి వచ్చినప్పుడు! అలాగని, రౌడీలు గూండాలు కలకాలం దొంగోట్లు వేయించే కూలీలుగానే వుండిపోవాలా? దున్నగలిగే వాడిదే భూమి అన్నారు. అలాగే, రిగ్గింగు చేయగలిగిన వాడిదే రాజ్యం! దొంగోట్లు వేయించుకోగల వాడిదే పదవి ! (లైట్ ఆఫ్)

### III. ట్రైన్ వచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది

(కార్యకర్తలు హడావుడిగా గాంధీ గురించి బోగీల్లో వెతుకుతున్నారు. గాంధీ రాజారాంతో కలసి వొక వైపు నుండి వచ్చేడు)

**కార్యకర్త :** మహాత్మా ! మీరు యిలా సెకండ్ క్లాసులో వచ్చేరేవిఁటి?

**గాంధీ :** థర్డ్ క్లాసు తీసేశారుగా ! (నడుస్తూ మాట్లాడేడు) మంత్రులు, ప్రజా ప్రతినిధులు విలాసవంతమయిన జీవితాన్ని విడిచిపెట్టి నిరాడంబరంగా బ్రతకాలి. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే వరకు, యే మంత్రి గానీ, ఎమ్మెల్యేగాని గవర్నమెంట్ బంగళాలను, కార్లను వుపయోగించరాదు. (స్పాట్‌లైట్ ఆఫ్).

### IV. ఇంకొక చోట స్పాట్ వెలిగింది

(ఆ వెలుగులో రామరాజ్యం పార్టీ నాయకుడు కనిపించేడు)

**రా.పా.నా:** ఇక రాజకీయాల్లోకి వచ్చి చేసేదేముంది. ఓరి పిచ్చోడా, సామాన్య మానవుడు గంజిలోకి ఉప్పు కూడా సొంతడబ్బుతోనే కనుక్కోవాలి. అదే రాజకీయ నాయకులకు కార్లు, బంగళాలు, ఫారిన్ ట్రిప్పులు, ఆఖరికి జబ్బులొస్తే చేసే ఆపరేషన్లు అన్నీ ఫ్రీగా జరిగిపోతాయి. కనకనే పదవులకోసం పడి చస్తున్నారు. (స్పాట్‌లైట్ ఆఫ్)

### V. మళ్లీ ఇంకొక చోట స్పాట్ వెలిగింది

(గాంధీ ఒక వేదిక మీద నిలబడి మాట్లాడుతున్నాడు)

**గాంధీ :** రాచరిక వ్యవస్థ అంతరించింది కాబట్టి, ఒక కుటుంబంలో మూడు తరాలకి వొకసారి వొక్కరే యెన్నికల్లో పోటీ చెయ్యాలి. ఎన్నికల వాగ్దానాలను అమలు చెయ్యని పార్టీకి తర్వాత యెన్నికల్లో పోటీ చేసే అర్హత వుండదు. పదవుల్ని అడ్డం పెట్టుకుని సంపాదించిన ఆస్తుల్ని వాళ్ళు ప్రజాపరం చెయ్యాలి. (స్పాట్ లైట్స్ ఆఫ్)

### VI. ఇంకొక చోట స్పాట్ వెలిగింది

(ఆ వెలుగులో ప్రతిపక్ష పార్టీ నాయకురాలు కనిపించింది)

**ప్ర.ప.నా** సంపాదించొద్దంటే మానేస్తామేమోగాని, సంపాదించింది యిచ్చెయ్యమంటే యెవడిస్తాడు? అంత తెలివి తక్కువ వాళ్ళెవరూ లేరిక్కడ! (లైట్స్ ఆఫ్)

### VII. టీ.వీ. న్యూస్

(టీ.వీ.లో గాంధీ ఉపన్యాసం)

**గాంధీ :** నియమ నిష్ఠలు లేని రాజకీయాలు, మానవత లేని శాస్త్ర విజ్ఞానం, అంతఃకరణలేని ఆనందం, త్యాగంలేని పూజ, నీతిలేని వాణిజ్యం, పనిలేని సంపద శీలంలేని విద్య – ఇవి సప్త మహాపాతకాలు. మన రాజకీయ నాయకులకు వంటి నంటి ఉన్న ఈ సప్త మహాపాతకాల్ని, ముందుగా వదలించాలి. (లైట్స్ కొంచెంగా కాంతివంతమయేయి. అధికార పార్టీ నాయకుడి ఇంట్లో అధికార పార్టీ నాయకుడితో పాటు ముగ్గురు ఎమ్మెల్యేలు టీ.వీ. చూస్తున్నారు. గాంధీ ఉపన్యాసం ప్రసారమవుతూంది. పూర్తిగా లైట్లు అన్నీ వెలిగాయి)

## సీన్ నెం. 9
## Montages

(టీ.వీ.లో గాంధీ ఉపన్యాసం కంటిన్యూ అవుతూంది.)

ఈ షరతులకు లోబడి ప్రజా ప్రతినిధులు 15 రోజుల్లో స్పందించకపోతే – వారిపై శాంతి యుద్ధం ప్రకటించబడుతుంది. కోటి మంది ప్రజలతో అసెంబ్లీని చుట్టుముట్టి, వారు రాజీనామా చేసే వరకు సత్యాగ్రహం చేస్తాం! (అ.పా.నా. చేతిలోని రిమోట్‌తో టీ.వీ.ని ఆఫ్ చేశాడు)

**ఎమ్మెల్యే3:** కోటి మంది ఒకచోట చేరి ముట్టడిస్తే ఇంకేం వుందండి బాబు! మన పదవికి నీళ్ళు వదులుకోవాల్సిందే!

**ఎమ్మెల్యే2:** మనం పాపులారిటీ కల్పించిన వ్యక్తి మనకే ఎసరు పెడతాడా! గన్‌మెన్ లేకుండా తిరిగితే – నా నియోజక వర్గంలో నెలకో బై–ఎలక్షన్ పెట్టాల్సి వస్తుంది.

**ఎమ్మెల్యే1:** అసలు అతడెవడన్నా మనకి చెప్పడానికి? మీరొక్కమాట చెప్పండి. నిజంగా గాంధీ బతికుండి యియ్యన్నీ చెయ్యమన్నాడనుకో, చేస్తామా?

**ఎమ్మెల్యే2:** చచ్చినా చెయ్యం!

**ఎమ్మెల్యే1:** మరలాంటిది, ఎవడో డూప్లికేట్ కోన్ కిస్కా గొట్టంగాడుచెబితే మనమేంటన్నా భయపడేది!

**అ.పా.నా:** నెమ్మది...నెమ్మది!

**ఎమ్మెల్యే1:** ఇంకా నెమ్మదేంటన్నా! కడుపు మండిపోతోంది. గాడిదకు అలంకారం చేస్తే గుఱ్ఱమయిపోతుందా! గాంధీలా వున్నంత మాత్రాన, గాంధీ అయిపోతాడా! పైగా అల్టిమేటం యిస్తాడా – అల్టిమేటం? చెప్పన్నా, నడిరోడ్డు మీద నరికేస్తా!

**అ.పా.నా:** అంత ఈజీగా తీసేయద్దు. అతను మీటింగ్ పెడితే ఎంతెంత మంది వచ్చారో టీవీలో చూశావ్‌గా! అతను చెప్పిన ప్రతిమాటకి ఎలా. రెస్పాండ్ అయ్యారు? అతన్ని చూసి జనాలు ఈగల్లా ముసురుతున్నారు. పరిస్థితి యిప్పుడెలా గుందంటే కొందరు గాంధీయే తిరిగి బ్రతికొచ్చేడంటున్నారు. మరికొందరేమో, గాంధీ కాదు – 'గాంధీ అంశ' అంటున్నారు. ఏం చేస్తాం?

**ఎమ్మెల్యే1:** ఈ టెన్షన్ యిక భరించకలేకపోతున్నాం. ఏం చెయ్యాలో చెప్పన్నా!

**అ.పా.నా:** ఆలోచిస్తున్నా ఆలోచిస్తున్నా

**ఎమ్మెల్యే1:** ఇంకేటన్నా ఆలోచించేది – ఆ గాంధీ చీటీ చించి అవతల పారేయకుండా?

**ఎమ్మెల్యే4:** అన్నా! అన్నా! అన్నా! (అంటూ పరుగు పరుగున వచ్చాడు. అతని జుట్టు రేగిపోయి, బట్టలు చిరిగిపోయి ఉన్నాయి)

**అ.పా.నా:** ఏమయిందయ్యా! ఏవిటిదంతా!

**ఎమ్మెల్యే4:** ఏంటా? పదివేల మంది ఇంటిమీదకొచ్చి దాడిచేశారన్నా!

**అ.పా.నా:** దాడి చేశారా! ఎందుకు?

**ఎమ్మెల్యే4:** ఎందుకేమిటి? గాంధీ ఉపన్యాస ప్రభావం

**అ.పా.నా:** ఆ!!

**ఎమ్మెల్యే4:** ఒరేయ్! నువ్వు కబ్జా చేసిన భూములన్నీ ప్రజలకు పంచుతావా లేదా అని నిలదీశారు – నేను పంచనన్నాను – అక్రమంగా ఆర్జించిన డబ్బంతా ప్రభుత్వపరం చేయమన్నారు – నేను చెయ్యను ఏం చేస్తారో చేసుకోమన్నాను. దాంతో రెచ్చిపోయి బాదేశారన్నా (ఏడ్చాడు).

**అ.పా.నా:** ఆడదానిలా ఎందుకయ్యా ఏడుస్తావు! ఆ ఏడుపాపు.

**ఎమ్మెల్యే4:** నేను ఏడుపాపుతాను, నువ్వా గాంధీ ఉద్యమాన్ని ఆపు.

**ఎమ్మెల్యే2:** అది అపకపోతే వీడికి పట్టిన గతే మనందరికీ పడుతుంది.

**అటెండరు:** (వచ్చాడు) సార్!

**అ.పా.నా:** ఏమిటీ

**అటెండరు:** అన్ని పార్టీ లీడర్స్ వచ్చారు సార్!

**అ.పా.నా:** ముందు వీణ్ణి లోపలికి తీసుకెళ్ళి స్నానం చేయించి వేరే బట్టలు ఇవ్వండి. (వెళ్లారు) – రమ్మను.

**అటెండరు:** ఎస్ సార్!

(అందరూ గాభరా గాభరాగా వచ్చారు అందరిచేతుల్లో ఒక్కో సూట్‌కేస్ ఉంది).

**అ.పా.నా:** ఏంటిలా అందరూ కట్టకట్టుకు వచ్చారు?

**రా.పా.నా:** ఏవుందన్నా ఆ గాంధీ ఉపన్యాసాలు విని ప్రజలు రెచ్చిపోతున్నారు.

**పే.పా.నా:** ఆ పార్టీ ఈ పార్టీ అని చూడకుండా రాజకీయ నాయకుడన్నవాడు కనబడితే చాలు – నిరసనలు, వేళాకోళాలు.

**ప్ర.ప.నా:** అబ్బబ్బా ఏం ఫాలోయింగు! ఏం ఫాలోయింగండి బాబు.

**రా.పా.నా:** దీని తస్సాదియ్యా! రైతులు, కూలీలు, కార్మికులు, యువకులు, వీరూవారని ఏముందయ్యా ప్రతి ఒక్కడు గాంధీకి జై అంటున్నాడు.

**పే.పా.నా:** కొంతమందయితే ఏకంగా కొల్లాయి గుడ్డలు కట్టుకొని, గుళ్లు గీయించుకొని, చేతిలో కర్రపట్టుకొని అచ్చంగా గాంధీలా తయారవుతున్నారు. శాంతి సైన్యమట – శాంతి సైన్యం.

**ప్ర.ప.నా:** ఇది ఇంకా మొదటి దశలోనే ఉంది. ఈ ఉద్యమాన్ని ఇక ఎదగకుండా మొగ్గలోనే తుంచివేయాలి.

**రా.పా.నా:** ఎక్కువైయిందో, ఈ భూమి మీద మనకు నూకలు చెల్లిపోతాయి.

**అ.పా.నా:** మీజోలికి ఎవ్వడొస్తాడయ్యా! మీరేమన్నా రూలింగ్‌లో ఉన్నారా?

**పే.పా.నా:** రూలింగ్, అపోజిషన్ అన్న తేడా లేదు అతనికి. మీతోపాటు అన్ని పార్టీలకు పెద్ద పెద్ద ఉత్తరాలు రాశాడు. (అని జేబులోంచి ఉత్తరం తీస్తూ) చూడండి, ఈ దేశంలో పరిశ్రమలన్నీ మూతపడడానికి కారణం మేమేనట.

**రా.పా.నా:** ఈ దేశం అనేక మతాలతోను, సంస్కృతులతోను, విరబూసిన గులాబీ తోటట! మేము దానికి పట్టిన చీడపురుగులమట.

**ప్ర.పా.నా:** మాకైతే మరీ ఘోరం! ఈ దేశం ఇంత దౌర్భాగ్య స్థితిలో ఉండడానికి మా పార్టీయే కారణమట – విశ్వాసం లేదా మనిషికి.

**అ.పా.నా:** అయితే ఇప్పుడు మీరేమి చెయ్యాలనుకుంటున్నారు! నా దగ్గరికి ఎందుకొచ్చారు?

**పే.పా.నా:** ఏంచేస్తావో, ఎలా చేస్తావో! ఇదిగో ముగ్గురం ఆలోచించుకొని తలా ఒక సూట్‌కేస్ తెచ్చామ్ – ఆ గాంధీ అడ్డు తొలగించాలని.

**అ.పా.నా:** కానీ మన చేతులకి మట్టంటకూడదు – అంతేనా? సరే ఈ విషయమై పోలీస్ కమీషనర్‌కి ఫోన్ చేశాను, కాసేపట్లో వస్తాడు.

**పో.క :** (ప్రవేశిస్తూ) ఏవిటీ! అంత అర్జెంటుగా రమ్మన్నారు?

**అ.పా.నా:** ఆ గాంధీ విషయం ఎలా రివర్సయిందో చూశావా?

**పో.క :** చూశాను! బింద్రెన్ వాలా దగ్గర నుండి బిన్ లాడెన్ వరకు ఇలాగే జరిగింది.

**అ.పా.నా:** నిజమేనయ్యా! రాజకీయాల్లో ఎవ్వడికీ మోతాదుకు మించిన పబ్లిసిటీ ఇప్పించకూడదు!

**పో.క :** సరే! ఇప్పుడు ఏం చేయాలనుకుంటున్నారు?

**అ.పా.నా:** చెప్తాను! గాంధీ అడ్డు తొలగించడానికి ఒక మాస్టర్ ప్లాన్ వేశాను (కమీషనర్ వాళ్ళ వొంక చూశాడు)

**ప్ర.పా.న:** అందరం చేతులు కలిపాం!

**అ.పా.నా:** నేషనల్ ఎమర్జెన్సీ కదా! నువ్వు సహకరించాలి - సక్ససైతే నువ్వే నెక్స్ట్ డి.జీ.పి.వి.

**పో.క :** నేను మీవాడ్ని! మీమాట ఎప్పుడైనా కాదంటేగా! చెప్పండి ఏం చెయ్యాలో.

**అ.పా.నా:** (అటెండర్‌తో) ఒరేయ్, వాళ్ళని రమ్మను. (అటెండరు వెళ్లాడు. ఈలోగా నలుగురూ దగ్గరగా చేరారు)

**ఎమ్మెలే1:** (వస్తూ, ఉద్రేకంతో) అయితే, ఇంతకీ ఆ గాంధీ విషయంలో ఏం నిర్ణయం... (ప్రతిపక్షాలున్నారని గమనించి, ఠక్కున ఆగిపోయాడు)

**అ.పా.నా:** అందరం ఒక ఒప్పందానికి వచ్చామయ్యా!

**ఎమ్మెలే1:** అయితే ఏశెయ్ మంటావా అన్నా?

**అ.పా.నా:** ఎవర్నీ?

**ఎమ్మెలే1:** ఇంకెవరినీ - ఆ గాంధీని!

**అ.పా.నా:** మరదే! లీడర్కీ ఫాలోయర్కీ ఉన్న తేడా!
ఇలా రండి - అందరూ జాగ్రత్తగా వినండి !
(అందరూ గుమిగూడారు)

(లైట్సాఫ్)

## సీన్ నెం. 10

(లైట్స్ వెలిగేయి. అర్థరాత్రి యాదగిరి హుండీలోంచి డబ్బు తీసి బేగ్‌లోకి సర్దేడు. పాప పరిహారంగా తన జేబులోది ఒక రూపాయి బిళ్ళ తీసి హుండీలో వేసాడు. ఎవరూ చూడట్లేదని నిర్ధారించుకుని, కదిలేడు. ఎదురుగా ఒక వ్యక్తి గండ్రగొడ్డలితో వచ్చేడు. కంగారుపడి యింకొక వైపుకి వెళ్ళబోయేడు. అక్కడ ఇంకోవ్యక్తి తన గొడ్డలికి పదును పెడుతూ కనిపించేడు. దాంతో మరింత కంగారుపడి మూడో వైపుకు కదిలేడు. అటువైపు నుంచి చేతిలో గొడ్డలి తిప్పుకుంటూ నవ్వుతూ మరోవ్యక్తి వచ్చేడు. యాదగిరిలో భయం పుట్టింది. ఎటువెడితే అటు వాళ్ళు దగ్గర అవుతూ వచ్చేరు. ఇక యేం చెయ్యలేక యాదగిరి వాళ్ళకి తన చేతిలోని బేగ్ యిచ్చి వదిలేయమన్నట్టుగా ప్రాధేయపడ్డాడు. వాళ్ళు కుదరదన్నట్టు నవ్వేరు. యాదగిరి అలా భయంతో

కుంచించుకుపోతూండగా, ముగ్గురూ బాగా దగ్గరికి వచ్చి గొడ్డళ్ళు ఎత్తడం, యాదగిరి చావుకేక పెట్టడం వొకేసారి జరిగిపోయేయి. అది విని 'ఎవరది'? అంటూ గాంధీగారు బయటకు వచ్చారు. హంతకులు పారిపోయారు. గాంధీ యాదగిరిని చూసి చలించిపోయాడు. "హే రామ్" అంటూ యాదగిరి కడుపులో దిగబడిన గొడ్డలిని తీస్తూ ఉండగా బయట పోలీసు జీపు సైరను, బూట్ల శబ్దం, విజిల్స్ వినబడ్డాయి. (క్రమంగా లైట్స్ ఫేడౌట్)

## సీన్ నెం. 11

( కోర్టులో జడ్జి తన ఆసనం మీద కూర్చుని వున్నాడు. లాయర్లు వారి వారి సీట్లలో వున్నారు. ఒక బోనులో గాంధీ నిల్చుని వున్నారు. ప్రేక్షకుల గ్యాలరీలో రాజారాం వున్నాడు. అతని కళ్ళ నిండా నీరు. పబ్లిక్ ప్రాసికూటర్ గౌను సర్దుకుని మధ్యకు వచ్చాడు)

**పీ.పీ :** మిలార్డ్! ఈ బోనులో వున్న వ్యక్తి ఒక మోసగాడు! ఒక దగాకోరు! ఒక యింపర్సనేటర్! మన పూజ్య బాపూజీలా వేషం వేసుకుని ప్రజలను మోసం చేశాడు యువరానర్! మన జాతిపిత గాంధీగారి స్వరాష్ట్రం గుజరాత్ గనుక, అక్కడ వచ్చిన భూకంపాన్నీ, భూకంప బాధితుల్నీ చూడడానికి వచ్చానని అబద్ధాలు చెప్పాడు యువరానర్! అంతేకాకుండా గుజరాత్ భూకంప బాధితుల కోసం నిధి పేరిట కొన్ని లక్షలు విరాళాల రూపంలో వసూలు చేశాడు. యువరానర్! ఈ అన్యాయ వ్యవహారాలన్నీ బయటపెడతానన్న ఎమ్మెల్యే యాదగిరిని దారుణంగా క్రూరాతిక్రూరంగా హత్య చేశాడు యువరానర్! ఆ హత్యానేరం నుండి తప్పించుకోవడానికి విదేశాలు పారిపోయి, యీ దేశం స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని హరింపజేయడానికి విదేశాలతో కుట్రపన్నాడు యువరానర్! ఇతను ఒక మోసగాడు, దగాకోరు, ఖూనీకోరే కాకుండా – యీ దేశానికి యెంతో హాని తలపెట్టిన దేశద్రోహి యువరానర్! అందుకు సంబంధించిన యెగ్జిబిట్స్ కోర్టువారికి సమర్పిస్తున్నాను. యువరానర్! ఇది ముద్దాయి గాంధీ వేషం వేసుకుని తిరిగినప్పటి ఫోటో. ఇది గాంధీ వేషంలో గుజరాత్ భూకంప నిధికి విరాళాలు సేకరిస్తున్న ఫోటో. ఇది ముద్దాయి గాంధీ వేషంలో ఉపన్యాసం

యిస్తున్నప్పటి ఫోటో, ఇవి వార్తల క్లిప్పింగ్స్! వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, ముద్దాయిని దేశద్రోహం నేరం కింద, హత్యానేరం కింద తగిన విధంగా శిక్షించవలసిందిగా కోర్టువారిని సవినయంగా ప్రార్థిస్తున్నాను. యువరానర్!

**జడ్జి** : మిస్టర్, నీ పేరేవిఁటి?

**గాంధీ** : మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ!

**జడ్జి** : ఏ ఊరు?

**గాంధి** : పోర్‌బందరు, గుజరాత్!

**పి.పీ** : ఇదిగో – ఇదిగో యీ మాటల్తోనే తనో పెద్ద గాంధీ అయినట్టు ప్రజల్ని నమ్మించి మోసం చేశాడు యువరానర్!

**గాంధీ** : Please mind your language Mr. Prosecutor! నన్ను Impersonator అంటున్నారు. ఓకే! అదే నిజమయితే, నా అసలు పేరేవిఁటి? నా తల్లిదండ్రులెవరు? నాది యే వూరు? ఈ వేషం వెయ్యకముందు నేనేం చేసేవాణ్ణి? ఈ వివరాలన్నీ సేకరించారా? చెప్పమనండి యువరానర్!

**జడ్జి** : What is your reply Mr. prosecutor? (పీ.పీ. పోలీసు కమీషనర్ వంక చూశాడు)

**పో.క** : ఆ వివరాల కోసం చాలా ప్రయత్నించాం యువరానర్!

**జడ్జి** : ప్లీజ్ చెప్పాల్సింది ఏవైనా ఉంటే ఆ బోనులో నిలబడి చెప్పండి.

**పో.క** : పార్డన్ మీ యువరానర్! (బోనులో నిలబడి) ఎక్కడా యెలాంటి వివరాలూ లభించలేదు. అదిగో అక్కడున్న రాజారాం ఒక్కడే అతని సన్నిహితుడు.

**జడ్జి** : అతనెవరు?

**పో.క** : అతను ఒక స్వాతంత్ర్య సమరయోధుడు

**జడ్జి** : వారిని కోర్టులో ప్రవేశపెట్టండి

**కోర్టు బంట్రోతు** : "రాజారాం...రాజారాం...రాజారాం" (రాజారాం బోనులోకి వచ్చాడు)

**జడ్జి** : ఈయన మీకు తెలుసా?

**రాజా** : తెలుసు.

**జడ్జి** : ఈయనెవరో చెప్పండి.

**రాజా** : ఈయనే మనం ఆరాధించే మన జాతిపిత బాపూజీ, మహాత్మా గాంధీ!

**జడ్జి :** అది కాదండీ, నిజంగా ఆయనెవరు?

**రాజా :** నిజంగానే ఆయన మహాత్మా గాంధీ!

**జడ్జి :** అబద్దాలు చెబితే – ఆయనతో కలిసి మీరూ శిక్ష అనుభవించాల్సి వస్తుంది.

**రాజా :** ఆయన్తో కలిసి అనుభవించేది శిక్ష యెలా అవుతుంది, వరం అవుతుంది కాని?

**జడ్జి :** అది ఆయన నిజంగా గాంధీగారైతే! అలా అని మీరు ఋజువు చెయ్యగలరా?

**రాజా :** మేమెందుకు ఋజువు చెయ్యాలి? ఆయన గాంధీగారు కాదని కోర్టుకు తీసుకొచ్చారు – కాదని వాళ్లనే ఋజువు చేయమనండి! ఇంత అధికారం, యంత్రాంగం ఉన్న ప్రభుత్వం గదా! – ఆయన జీవిత వివరాలు చెప్పగలిగితే అప్పుడు – ఆయనది మారువేషం అని అంగీకరిస్తాం.

**జడ్జి :** What is your answer Mr. Prosecutor?

**పి.పీ. :** ఆయన వివరాలు మా దగ్గర లేవు యువరానర్?

**గాంధీ :** Then, withdraw the charge that I am an impersonator!

**జడ్జి :** As the prosecution fails to prove that the accused is an impersonator and to submit the details of his original name, address and other related information - the charge no. 1 is not framed.

**గాంధి :** Then, the hon'ble court may be pleased to direct the prosecutor and other government officials to call me as Mr. Mohan Das Karamchand Gandhi.

**జడ్జి :** Definitely! The court directs them to do so. The court is adjourned to 30.10.2001 for trial on 2nd and 3rd charges. Till then the accused should be kept in custody.

(లైట్సాఫ్)

# సీన్ నెం. 12

లైట్స్ ఫేడ్ ఇన్

(కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీస్ కమిషనర్ కూర్చున్నారు. జడ్జి రాగానే అందరూ లేచి, ఆయన కూర్చున్న తర్వాత కూర్చున్నారు గ్యాలరీలో రాజారాం ఉన్నాడు)

**జడ్జి** : Is prosecution ready?

**పీ.పీ.** : Yes, your honour !

**జడ్జి** : ముద్దాయిని ప్రవేశపెట్టండి.

(గాంధీ సంకెళ్ళతో వెనక గార్డులు వెంటరాగా, కోర్టులోకి వచ్చేడు. గార్డులు గాంధీ చేతులకు వున్న సంకెళ్ళు తొలగించేరు. గాంధీ వెళ్ళి బోనులో నిలబడ్డారు)

**జడ్జి** : ఈ రోజు యెందుకింత అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నారు…gun men and all these things?

**పీ.పీ.** : యువరానర్! పేరూ ఊరూ లేని ఈ మోసగాడు–

**గాంధీ** : Stop it Mr. Prosecutor. I think I need not tell you about contempt of court!

**జడ్జి** : Yes Mr. Prosecutor! I have ordered you to address him as Gandhi last time.

**పీ.పీ.** : సారీ యువరానర్! మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అనబడే యీ ముద్దాయిని – దేశద్రోహి, హత్యానేరాల క్రింద గతసారి మీ ముందు హాజరు పరచడం జరిగింది. మీరు రిమాండుకు పంపేరు. రిమాండులో వుండగా, యీ ముద్దాయి ఇద్దరు గార్డులని కొట్టి జైలు నించి తప్పించుకుని పోవాలని ప్రయత్నించేడు మిలార్డ్! ఇతని మానసిక పరిస్థితి పూర్తిగా పాడయిపోయింది. హింసా ప్రవృత్తితోనూ అనారోగ్యకరమయిన ఉద్రేక స్వభావంతోనూ నిండి పోయింది. అందుకనే యీ అదనపు జాగ్రత్తలు.

**రాజా** : అబద్ధం! మహాత్ముడు జైలు నుండి పారిపోవాలని ప్రయత్నించలేదు. అదంతా కట్టుకథ యువరానర్! యువరానర్! ఇంతకన్నా ఘోరం యింకెక్కడయినా

వుందా? దేశ రాజకీయ పరిస్థితుల్ని చక్క దిద్దాలనుకోవడం అతను చేసిన నేరమా? రాజకీయ నాయకుల దృక్పథాన్ని మార్చాలనుకోవడం దేశద్రోహమా?

**జడ్జి :** ఆర్డర్ ఆర్డర్!

**రాజా :** యువరానర్! స్వాతంత్ర్యం కోసం బ్రిటిషు వాళ్ళపై అంత పెద్ద తిరుగుబాటు చేశారు. వాళ్ళూ యేనాడు మహాత్మునిపై యింత పెద్ద నింద వెయ్యలేదు. సమాన మానవ హక్కులకోసం సౌత్ ఆఫ్రికాలో ఉద్యమాలు నడిపేరు. వాళ్ళు కూడా అతన్ని యేనాడూ యిలా బంధించలేదు. మనం మహాత్మునికి యిచ్చే గౌరవం యిదా? మన జాతి ఆయనకు యిచ్చే మర్యాద యిదా?

**జడ్జి :** ఆర్డర్! ఆర్డర్! వారిని కోర్టులోంచి బయటకు తీసికెళ్ళండి (గార్డులు రాజారాంని బయటకు తీసుకెళ్ళేరు) ప్రాసిక్యూషన్ యింకా యేమయినా అడగాలా?

**పి.పీ. :** No questions your honour !

**జడ్జి :** మిస్టర్ గాంధీ! మీ తరపున న్యాయవాది యెవరు?

**గాంధీ :** Your honour ! I am an advocate! Bar at Law! I can defend myself.

**జడ్జి :** O.K. Proceed!

**గాంధీ :** Your honour! సమభావం, సహజీవనం యీ దేశ జీవన సూత్రాలు. ఆసేతు హిమాచల పర్యంతం – కొండలతో, కోనలతో, అడవులతో, మైదానాలతో, నదీ నదాలతో, పరిపూర్ణమైన ప్రకృతి సంపదతో యెంతో సుందరమయినది నా దేశం. తమ ఆకలి తీర్చమని, అన్నం పెట్టమని – యే జాతి వచ్చి దేహీ అని దండుకు తిన్నా, దాహంతో ఏ జాతి దండెత్తి వచ్చినా, అందరినీ సమంగా ఆదరించి, అన్నం పెట్టి, కడుపు నింపిన అన్నపూర్ణ నా తల్లి. అందుకే తిండికి వచ్చినవాడు తిష్ఠ వేశారు – జెండా ఎగరేశారు – అలా కాలూనుకున్న పరాయి పాలన పరంపరలో బ్రిటిషువాళ్ళు 200 సంవత్సరాలు పాలించేరు. 1857లో మొదలయిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం దశలు దశలుగా జాతీయోద్యమానికి నాంది పలికింది. స్వపరిపాలన కోసం – స్వేచ్ఛా వాయువుల కోసం భారతజాతి నాంది పలికింది. దేశమాత దాస్య శృంఖలాల విముక్తి కోసం – యెందరో వారి వారి పరిధుల్లో ప్రయత్నించేరు. పునీతులయేరు.

తిలక్, లాలా, బిపిన్, భగత్‌సింగ్, సావర్కర్, ఆజాద్, జవహర్, బోస్, ప్రసాద్, పటేల్ – అంతకన్నా ముందు గోఖలే, మోతీలాల్– యిలా యెందరో యీ స్వాతంత్ర్య సముపార్జనకు తమ జీవితాల్నీ, ప్రాణాల్నీ ధారపోశేరు.

ఇప్పుడు మనం పీలుస్తున్న గాలి వాళ్ళందరూ వదిలి వెళ్ళిన ఊపిరులేనని గుర్తుంచుకోవాలి. కానీ – యెక్కడ చూసినా, యెవరి నోట విన్నా – మాకు గాంధీ స్వాతంత్ర్యం తెచ్చాడంటారు. అది నా అదృష్టమే తప్ప నా గొప్పదనం కాదు.

ఈ దేశంలో తల్లీ, తండ్రీ లేని పిల్లలుండొచ్చు గానీ, గాంధీతాతలేని బిడ్డ వుండదు. అందుకే యీ జాతి ఋణం, యీ దేశమాత ఋణం తీర్చుకోవాలనుకున్నాను. (కోర్టంతా కలయ చూసి, బోనులోంచి బయటకు రాబోయేడు. దాంతో పోలీసులు అలర్ట్ అయిపోయేరు. గన్స్ గురి చేశారు. పోలీస్ కమిషనర్ రివాల్వర్ తీశేడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కంగారుగా దాక్కునేందుకు పరిగెత్తేడు. కోర్టులో కలకలం రేగింది) కంగారు పడకండి. నేను పారిపోవట్లేదు. ఒక్కసారి నా మాతృభూమికి శిరస్సువంచి నమస్కరించాలని వుంది. అనుమతించండి యువరానర్!

**జడ్జి :** Yes, You are permitted.

**గాంధి :** (బోనులోంచి, దిగి భూమికి నమస్కరించారు. (జడ్జీ కూడా అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు) మళ్ళీ బోనులోకి వెళ్ళి నిలబడి) Your honour ! స్వాతంత్ర్యోద్యమం ఫలోన్ముఖమై, స్వాతంత్ర్యం చేతికి అందేంత చేరువకి వచ్చే సమయంలో – అపశృతి పలికింది. స్వార్థపిశాచం వికటాట్టహాసం చేసి వెక్కిరించింది. అంపకాల కోసం చేతులు కలిపిన అన్నదమ్ములే పంపకాల కోసం కత్తులు దూసుకున్నారు. బాధాకరమైన విషయం! సరే – తర్వాత, స్వాతంత్ర్యం వచ్చింది. ఇప్పుడు పరాయి పాలనా లేదు. పరాయి పీడనా లేదు. పరాయి వాళ్ళ దోపిడీ లేదు. అయినా దిన దిన ప్రవర్థమానం కావలసిన మన దేశం నానాటికీ అధోగతికి జారిపోతోంది. ఓ ప్రక్క అధోగతి– మరో ప్రక్క పురోగతి. అది కొందరికే దక్కుతోంది. అభివృద్ధితో ఫలాలు కొందరు మెక్కుతుంటే మరికొందరు దారిద్ర్యంలో జంతువులకన్నా హీనంగా బ్రతుకుతున్నారు. ఏమిటి కారణం? ఎవరు బాధ్యులు? ఏ పార్టీ అయినా – ఏ నాయకుడైనా సీరియస్‌గా ఆలోచించేరా? ప్రతి పార్టీకీ

యెన్నికల్లో గెలవాన్నదే ధ్యాస! అధికారం చేజిక్కించుకోవడమే ఆశ! ఒకరిమీద వొకరు బురద జల్లు కోవడం, బూతులు తిట్టుకోవడం – యిదే వారి గమ్యం! మంచి చేసినా, చెడు చేసినా అవతలిపక్షం వారిని దూషించటం, ద్వేషించటం – యిదే వారి లక్ష్యం!

మత ప్రసక్తి లేని ఎన్నికలేదు. కులం పేరు చెప్పకుండా గెలవగలిగే నాయకుడు లేడు. ప్రార్థన స్థలాల్ని Propaganda Places గా మార్చేశేరు. ఇంతకన్నా దౌర్భాగ్యం యెక్కడుంటుంది? అప్పుడు మేము స్వాతంత్ర్యం కోసమే పోరాటం చేసాం. కానీ ఇప్పుడు ప్రజలు ప్రతీదానికీ పోరాడాల్సి వస్తోంది. తిండికి, బట్టకు, నీటికి, నిప్పుకి, స్థలాలకి, పొలాలకి – ఇలా ప్రతీ దానికోసం ఓ పోరాటం చేస్తే తప్ప అవి దక్కడం లేదు. ప్రజలు ప్రాణాల్ని ఫణంగా పెట్టి పోరాడుతుంటే రాజకీయ పక్షాలు వాటిని కూడా స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి అంటున్నారు. అప్పు యివ్వడం అభివృద్ధి గానీ – తీసుకోవడం అభివృద్ధా? మరి కొన్నాళ్ళకు అడుక్కుతినడం కూడా అభివృద్ధి అంటారేమో!

గాంధీగా పుట్టినందుకు ఒక్కోసారి యెంతగా పొంగిపోతానో – మరోసారి అంతగా కృంగిపోతూంటాను. ఒక ఆఫీసర్ యెవరూ చూడకుండా లంచం తీసుకుంటాడు. కానీ ఆ దురదృష్టకర సంఘటన నేను చూస్తుంటాను. ఎందుకంటే – ఆ ఆఫీసులో నా ఫోటో వుంటుంది కదా! ప్రభుత్వ కార్యాలయాల్లో, పార్టీ ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో, కోర్టుల్లో – (చుట్టూ జూశేడు. జడ్జి వెనకగా గాంధీ ఫోటో చూశేడు. జడ్జి కూడా ఆ ఫోటోని చూశేడు) ఇక్కడ ఎన్ని న్యాయమైన జడ్జిమెంట్లిచ్చేరో మీకు తెలుసు, నాకు తెలుసు. ఈ దురదృష్టం, మానసిక క్షోభ ప్రపంచంలో యే నాయకుడికీ లేదు. అందుకే యీ మానసిక క్షోభనుంచీ, అంతరంగంలోని ఆవేదననుంచీ బయటపడాలనుకున్నాను. కాబట్టి యీ దేశ రాజకీయ వాతావరణాన్ని పరిశుద్ధం చేయాలనుకున్నాను. రాజకీయ పార్టీలంటే ప్రజలకు రోత పుడుతోంది. పార్టీ అంటే – యేదో పదిమంది కలిసి యేర్పడిన గుంపు కాదు. పార్టీ అంటే – ప్రజల ప్రాపర్టీ. మంచి పార్టీలుంటే మంచి ప్రభుత్వం వస్తుంది. మంచి ప్రభుత్వమే మంచి పాలనను అందిస్తుంది. కాబట్టి నిందించాల్సింది కేవలం ప్రభుత్వాన్ని కాదు – పార్టీలని!

దేశంలోని నదులు, పర్వతాలు యెలా ప్రజల ఆస్తులవుతాయో, పార్టీలు కూడా అలాగే ప్రజల ఆస్తులు! అవి వారి ఆశయాల సాధనకు సాధనాలు. అవి వారి శ్రేయస్సుకు, సంక్షేమానికీ సంకేతాలు!

అందుకే యే పార్టీ యే తప్పులు చేస్తోందో, వాటిని యెలా సరిదిద్దుకోవాలో చాలా వివరంగా అన్ని పార్టీలకు లేఖలు వ్రాశేను. అందరికీ 'నేను 15 రోజులు గడువిస్తున్నాను, యీ 15 రోజుల్లో వారి వారి తప్పుల్ని వారు బహిరంగంగా ఒప్పుకుని వాటిని సరిదిద్దుకోవాలని' చెప్పేను. అదే నేను చేసిన దేశద్రోహం!

**పీ.పీ:** యువరానర్! హత్యానేరం నుండి, దేశద్రోహ నేరం నుండి తప్పించుకోవడానికి చూస్తూ ముద్దాయి యేవేవో పిచ్చి కూతలు కూస్తున్నాడు. అతను చేస్తున్న సంధి ప్రేలాపనలు వింటూ కాలయాపన చేయకుండా, అతను చేసిన నేరాలకు అతనిని కఠినాతికఠినంగా శిక్షించవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను. దట్సాల్ యువరానర్!

**జడ్జి :** Mr. Gandhi! ఇంకా మీరేమయినా చెప్పవలసి వుందా?

**గాంధీ :** దేశ రాజకీయాల్ని సంస్కరించాలనుకున్న నాదా నేరం? లేకపోతే అక్రమాలు చేస్తూ నా మీద అభియోగం మోపిన – వాళ్ళదా? మీరే నిర్ణయించండి.

**జడ్జి :** ఈ కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన తరువాత, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అనబడే యీ ముద్దాయిని I.P.C. 302, 124 A సెక్షన్ల క్రింద దేశద్రోహిగానూ, హంతకునిగానూ పరిగణిస్తూ, మరణశిక్ష విధించడమైనది. (అంటూ తీర్పు వ్రాసిన పెన్ నిబ్‌ని విరిచేశేడు)

(లైట్సాఫ్)

## సీన్ నెం. 13

(ఉరి కంబం)

(డాక్టరు, జైలరు, మెజిస్ట్రేటు, ఇతర అధికారులు నిలబడి వున్నారు.

గాంధీని తీసుకొచ్చారు. కూడా వచ్చిన రాజారాంని గార్డులు లోనికి అనుమతించలేదు. గాంధీజీ రాజారాంను ఓదార్చి కాలానికి సంకేతమైన తన గడియారాన్ని అతని చేతిలో పెట్టి పంపించాడు. గాంధీజీ ఉరికంబం వైపు నడుస్తున్నాడు)

**మెజిస్ట్రేట్:** మిస్టర్ గాంధీ...మీ ఆఖరి కోరిక యేమైనా వుందా.

**గాంధీ :** ఉంది.

**మెజిస్ట్రేట్:** ఏవిఁటది?

**గాంధీ :** మళ్ళీ జన్మించాలని!

**మెజిస్ట్రేట్:** ఆఁ?

**గాంధి :** అవును..స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశం 40 కోట్ల పౌరులతో నిండిన సమాజం! కానీ యీనాడు – వందకోట్ల వ్యక్తులున్న సముదాయం! స్వార్థపరులతో నిండిన గుంపు!

There are so many political parties in this country - each one is equally bad, collecting currency notes from the rich and votes from the poor, promising both, to protect from each other!

ఈనాడు యీ దేశంలో ఒకడిని దూషించడానికి వుపయోగించే పదం 'గాంధీ' అంటే; ప్రతి క్షణం నాయకులు వల్లించే వూతపదం 'గాంధీ' అంటే; పిల్లలు ఫ్యాన్సీ డ్రెస్ వేసుకోవడానికి వుపయోగపడే కేరక్టర్ 'గాంధీ' అంటే; ఓ కాలనీకో, ఓ షాపుకో పెట్టుకోవడానికి వుపయోగపడే అందమైన పేరు 'గాంధీ' అంటే; ఆలానా పాలనా లేక నడిరోడ్డులో శిధిలమైపోతున్న విగ్రహం 'గాంధీ' అంటే; ఆఖరికి బిచ్చగాళ్ళు అడుక్కోవడానికి వేసే ముష్టివేషం 'గాంధీ' అంటే – యిదే కదా ఈనాడు యీ దేశంలో నాకున్న స్థానం? నా యీ జీర్ణావస్థను, ప్రజల పతనావస్థను యింకా యింకా నా కళ్ళతో చూసే దౌర్భాగ్యం కలగకుండా మరణ శాసనం వ్రాసినందుకు నాకు చాలా సంతోషంగా వుంది.

కానీ నేను ఆలోచిస్తున్నది నా కోసం కాదు. రాబోయే తరాల గురించి! ఈ దగాకోరు నాయకుల పాలబడి ప్రజలు యేం కానున్నారో? అదే నా భయం! భయపడుతూ కర్తవ్యాన్ని మరిచిపోయే మనిషిని కాను నేను. 'Do or die!' అన్నాను ఆనాడు! ఈనాడు చెబుతున్నాను. Do some thing for your country even after death! నా సిద్ధాంతాలు నచ్చక అప్పుడు నన్ను కాల్చి వేసేరు. ఈ రోజున తెలివిగా ఉరి తీస్తున్నారు. ఇన్నాళ్ళూ దుర్మార్గుల్లో పరివర్తన తీసుకొస్తే సరిపోతుందని అనుకున్నాను. అందుకు అహింస మార్గంగా ఎంచుకున్నాను. కానీ, దుర్మార్గులు ఎక్కువైపోయి, సన్మార్గులకు స్థానం లేని భయంకరమైన పరిస్థితి వచ్చేస్తోంది. ఈ విషమ పరిస్థితిని సరిదిద్దాలంటే, దుర్మార్గుల్ని శిక్షించక తప్పదు. 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం' అన్నారు. కానీ, కంటికి కన్నూ – ప్రాణానికి ప్రాణం అన్న హింస కాదు నా మతం! మంచివాళ్ళ మీద జరుగుతున్న హింసను అరికట్టడానికి దుర్మార్గుల మీద జరిపే హింస హింస కాదు – అది అహింస కన్నా గొప్పది! అది నిర్హింస! అదే నా సరికొత్త నినాదం!

అందుకే యీ సారి ఒక చెంపమీద కొడితే మరో చెంప చూపించమనే గాంధీగా పుట్టను; ప్రజాధనాన్ని తిని తిని, తెగ బలిసిపోయిన తిమింగలాల్ని శిక్షించడానికీ; ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి అమాయకుల్ని, అసహాయుల్నీ దోచుకుతింటున్న కీచకుల్ని కడతేర్చడానికీ; స్త్రీల మాన ప్రాణాల్ని హరించే విషపురుగుల్ని నివారించడానికి అవసరమైన స్ఫూర్తిగా, చైతన్య స్వరూపంగా ఉద్భవిస్తాను! రాబోయే తరాలవారి నరాల నిండ చైతన్యాన్నీ, సత్యప్రియత్వాన్నీ నింపడానికి ఆత్మస్వరూపినై వస్తాను. మీ ఇంట్లో పెరుగుతూ, మీ పక్కలో బల్లెంగా వుంటాను జాగ్రత్త! నేను యే రూపంలోనైనా వస్తాను. నాకు ఎల్లలు లేవు!

ఉషోదయపు వెలుగుల్లో, జాబిలి వెన్నెల్లో – నేనే వుంటాను!

విరిసిన పుష్పంగా, కురిసే మేఘంగా – నేనే వస్తాను!

నింగిన చుక్కనై, నాలుగు దిక్కులలై – నేనే నిలుస్తాను!

కొండల్లో కోనల్లో, నదిగా నదంగా చైతన్యపు పదంగా – నేనే చరిస్తాను!

వేకువ రేఖనై, ఆకలి కేకనై అణువణువునా – నేనే గమిస్తాను!

అన్యాయపు కోటల్నీ, అవినీతి బాటల్నీ

అసత్యపు నీడల్నీ, అంధకారపు గోడల్నీ

అంతం చేయడానికి మళ్ళీ అవతరిస్తా.

అవతరిస్తా! అంతం చేస్తా! అవతరిస్తా! అంతం చేస్తా! ఖబడ్దార్!

(గాంధీ పైకి వెళ్ళగానే ఉరితాడు ఎగిరిపోయింది.

పుష్పక విమానం పైనుండి మెల్లిగా కిందికి దిగి వచ్చింది. మాతలి స్వరం వినిపించింది. "మహాత్మా దేవేంద్రులవారు తమరిని స్వర్గానికి తీసుకురమ్మని నన్ను పంపారు, దయచేయండి" అని అన్నాడు. గాంధీ అందులోకి ఎక్కి కూర్చున్నాడు. కిటికీలోంచి అందరికి వీడ్కోలు నమస్కారం చేశాడు. విమానం మెల్లగా పైకి వెళ్ళిపోయింది. లైట్స్ నెమ్మదిగా డిమ్ అయిపోయాయి).

**THE END**

***